PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 216, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శనివారం - 26 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి: ప్రధాని మోదీ




దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి

వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య

# కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలి

## అహ్మదాబాద్ పర్యటనలో పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు

★ టోరెంట్, వెల్స్‌పన్, ఆస్ట్రల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ



అమరావతి: ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు, తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, మిగతా 2 లో

# వరదనీటితో జలాశయాలన్నీ నింపాలి

## ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడండి

- భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించాలి
- సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు
- గోదావరి, నాగావళి, వంశధార పరివాహకంలో వర్షాలు
- వరద ప్రవాహం పెరుగుతుండటంతో భద్రాచలం వద్ద 26వ తేదీ (శనివారం) మధ్యాహ్నానికి ప్రమాదస్థాయి -1, అదే రోజు రాత్రికి ప్రమాదస్థాయి-2 దాటే అవకాశం ఉంది



అమరావతి: భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరదల్ని ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ.. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని నిర్దేశించారు. ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి చక్కదిద్దాలి.. మిగతా 2 లో

## ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు.. ఫారం 7 అంటే ఏమిటి?.. ఎప్పుడు వాడాలి?




చనిపోయిన, చిరునామా మారిన వారి పేర్లను తీసివేయడానికి ఇది ఉపయోగం

అదే నియోజకవర్గంలోని ఏ ఓటరైనా ఫారం 7 ద్వారా అభ్యంతరం చెప్పవచ్చు

దరఖాస్తు తర్వాత క్షేత్రస్థాయి విచారణ జరిపి తుది నిర్ణయం

## వర్షాలు తగ్గే వరకు పూర్తి అప్రమత్తత అవసరం




- యంత్రాంగం మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి
- లోతట్టు ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాలి
- అవసరమైతే ముంపు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి'
- 'రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 117.6 మి.మీ. వర్షపాతం నమోదైంది

అమరావతి: 'కాకినాడ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు




## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు..

37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం: నాదెండ్ల మనోహర్

- విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్
- రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న నాదెండ్ల
- ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడి




## రేవంత్ రెడ్డికి 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డు

- కేరళకు చెందిన అర్శదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ పురస్కారం
- ప్రజా సంక్షేమ పాలనకు లభించిన జాతీయ గుర్తింపు

## రాష్ట్రంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం



ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణ అంటే కేవలం చలానాలు విధించడం, వసూలు చేయడమే కాకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం, అత్యవసర వైద్య సాయం అందించడమే లక్ష్యంగా 'తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో' ను ఏర్పాటు చేశారు. 'రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి' పరిధిలో ఈ కొత్త వ్యవస్థ ముఖ్యమంత్రి గారి పరిధిలో పనిచేస్తుంది. ఆ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో 135) జారీచేసింది. మిగతా 2 లో




## అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ విలువలను కాలరాస్తే న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవు

- సుప్రీం తీర్పు.. రేవంత్‌కు చెంపపెట్టు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది గట్టి గుణపాఠం'
- "దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో' అంటూ రాజ్యాంగ పరిరక్షణ గురించి రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన మిగతా ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించండి

# ఖైరతాబాద్‌లో భాజపా విజయం ఖాయం

## దానం కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్పూర్తిగా స్వాగతిస్తున్నాం

★ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని కేసీఆర్ ప్రభుత్వం వారిని చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసింది

★ అదే రీతిలో భారాస ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయించింది

★ దానం వ్యవహారంలో.. కాంగ్రెస్, భారాసలు ఎవరికి వారే తమ విజయంగా భావించడం హాస్యాస్పదం

★ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్



హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్, భారాసలకు చెంపపెట్టు లాంటిదని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. దానం కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్పూర్తిగా స్వాగతిస్తున్నానని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని కేసీఆర్ ప్రభుత్వం వారిని చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని, అదే రీతిలో భారాస ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయించిందన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఈ రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని, భాజపాదే ఘనవిజయమని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో భాజపా గెలుపు తథ్యమని . మిగతా 2 లో

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి... ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం




- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

హైదరాబాద్: హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు

### గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...
## ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

హైదరాబాద్: హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుని ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

### నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు..
## 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం: నాదెండ్ల మనోహర్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని నవంబర్ 1న ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడిన ఆయన, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియలను సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సేకరణ ప్రక్రియ కోసం 24 వేల మంది సిబ్బందిని నియమించగా, కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. ఈసారి రైతులకు రవాణా ఖర్చులు కూడా చెల్లించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట దిగుబడులు, తద్వారా ధాన్యం సేకరణ అంచనాలు తగ్గినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా సకాలంలో కొనుగోళ్లు చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లుల సామర్థ్యం, చెల్లింపుల ప్రక్రియ వంటి అంశాల్లో పౌరసరఫరాల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు.

## దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి: ప్రధాని మోదీ

ఢిల్లీ: స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహోన్నతుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బతీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం కావాలని ఆయన భావించినట్లు తెలిపారు. పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. ఈ ఆలోచనల స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

### యూపీఐ లావాదేవీలపై చార్జీలు..
## వినియోగదారులకు భారం లేదన్న నిర్మలా సీతారామన్

ఢిల్లీ: యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) చార్జీలు విధించనున్నారనే ప్రచారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. ఈ అంశంతో సాధారణ ఖాతాదారులు లేదా వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి జేబుపై ఎలాంటి అదనపు భారం పడదని తెలిపారు. రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట డిజిటల్ లావాదేవీలకు ఎండీఆర్ వర్తించినా, అది వినియోగదారులకు కాదని, వ్యాపారులకే పరిమితమని మంత్రి చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు స్పష్టతనిచ్చారు. ఎండీఆర్ అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని... ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు వంటి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల కోసం ఈ రుసుము ఉంటుందని వివరించారు. ఎండీఆర్ నిబంధనలపై అవగాహన లోపం వల్లే అనవసర అపోహలు వ్యాపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపుల్లో వ్యాపారులు ఇలాంటి రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. యూపీఐ చెల్లింపుల విషయంలోనూ ఈ చార్జీని కస్టమర్లపైకి నెట్టే అవకాశం ఉండదని మంత్రి తేల్చిచెప్పారు. డిజిటల్ చెల్లింపులను ఉపయోగించే ప్రజలకు సేవలు ఉచితంగానే, ఎప్పటిలాగే అంతరాయం లేకుండా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళానికి గురికావొద్దని సూచించిన ఆమె, ఎండీఆర్ ద్వారా వసూలయ్యే సొమ్ము డిజిటల్ పేమెంట్ నెట్‌వర్క్ నిర్వహణలో భాగస్వామ్యమైన బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థల వ్యవస్థాపక వ్యయాలకే ఉపయోగపడుతుందని వివరించారు.

## అమెరికాతో చర్చలకు ఇరాన్ 7 రోజుల ఫార్ములా

ఢిల్లీ: అమెరికాతో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలను చల్లార్చే దిశగా ఇరాన్ ఒక కీలక ప్రతిపాదనను ముందుంచింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచి, కేవలం ఏడు రోజుల్లోనే విస్తృత చర్చలను పునఃప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ఈ ప్రతిపాదనను మధ్యవర్తుల ద్వారా ఈ వారంలోనే అమెరికా అధికారులకు పంపినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్వయంగా వెల్లడించారు. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా ఆయన ఈ వివరాలు తెలిపారు. అయితే, ఈ ప్రతిపాదనపై వైట్‌హౌస్ ఇంకా స్పందించలేదు. ప్రపంచంలోని చమురు సరఫరాలో దాదాపు 20 నుంచి 25 శాతం హర్మూజ్ జలసంధి గుండానే జరుగుతుంది. ఫిబ్రవరిలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల తర్వాత, టెహ్రాన్ ఈ మార్గంలో మైన్‌లు పెట్టి నౌకల రాకపోకలను దాదాపుగా నిలిపివేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రతిపాదనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల ఐరాస సమావేశంలో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ చర్చలకు రాకపోతే 'విధ్వంసం' తప్పదని తీవ్రంగా హెచ్చరించారు. దీనికి బదులిచ్చిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బయటి శక్తుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి తగినంత శక్తి అవసరమని, అయితే చర్చలకు, దౌత్యానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమమే ఈ వివాదానికి మూలకారణం. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా చూడాలని అమెరికా పట్టుబడుతుండగా, శాంతియుత అణు సాంకేతికతను అభివృద్ధి చేసే హక్కు తమకు ఉందని ఇరాన్ వాదిస్తోంది. తాజా ప్రతిపాదనలోని ఏడు రోజుల ప్రక్రియలో అణు అంశంపై చర్చిస్తారో? లేదో? అరాఘ్చీ వెల్లడించలేదు.

### వంశధార, నాగావళికి పోటెత్తిన వరద..
## మొదటి ప్రమాద హెచ్చరికలు జారీ

అమరావతి: భారీ వర్షాల నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ప్రధాన నదులైన వంశధార, నాగావళిలో వరద ఉధ్ధృ క్రమంగా పెరుగుతోంది. నదీ ప్రవాహం పోటెత్తుతుండటంతో అధికారులు ప్రధాన బ్యారేజీల వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ క్రమంలో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. వంశధార నదిపై ఉన్న గొట్టా బ్యారేజ్ వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం ఈ బ్యారేజ్‌లోకి 41,014 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, అంతే మొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మరోవైపు నాగావళి నదిలోనూ వరద ప్రవాహం కొనసాగుతోంది. తోటపల్లి బ్యారేజ్ వద్ద ఇన్-ఫ్లో, అవుట్-ఫ్లో 45,661 క్యూసెక్కులుగా నమోదవుతోంది. నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట వద్ద ప్రవాహం 59,700 క్యూసెక్కులకు చేరడంతో అధికారులు అక్కడ కూడా మొదటి ప్రమాద హెచ్చరికను అమలులోకి తెచ్చారు. ఈ పరిస్థితులపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ.. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరద తీవ్రత దృష్ట్యా నదుల్లోకి ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటి పనులు అత్యంత ప్రమాదకరమని, అటువంటి వాటికి దూరంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

## రేవంత్ రెడ్డికి 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తున్న 'ఆర్యదాన్ ముహమ్మద్ -- 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పాటు రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న వినూత్న పథకాలు, దూరదృష్టి గల నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ ప్రకటించారు. ఈ అవార్డు ప్రదానోత్సవం కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ 4వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అవార్డును స్వీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేరళ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ స్మారకోపన్యాసం చేయనున్నారు. రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను రేవంత్ రెడ్డికి అందజేయనున్నారు. ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ మంత్రి ఏ.పి. అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్‌పెట్ట నారాయణన్‌లతో కూడిన జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ అవార్డుకు ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కేరళ రాజకీయాల్లో ఆర్యదాన్ ముహమ్మద్ సీనియర్ నేతగా, 8 సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. కార్మికులు, ప్రజా సంక్షేమం, లౌకికవాద విలువలకు ఆయన ప్రతీకగా నిలిచారు.

# కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలి

అమరావతి: ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు, తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేసి, పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. లోకేశ్ ప్రతిపాదనలపై కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించి, వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

క్లీన్ ఎనర్జీలో ఏపీని ఎంచుకోండి: టోరెంట్ గ్రూప్‌తో లోకేశ్

ఫార్మా, పవర్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, ఇతర డైరక్టర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఫార్మా క్లస్టర్లలో ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని కోరారు. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధన రంగంలో టోరెంట్ గ్రూప్ ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు ఏపీ అనువైనదని తెలిపారు. పంప్డ్-స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీర్ మెహతా స్పందిస్తూ.. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే తమ లక్ష్యమని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పక పరిశీలిస్తామని చెప్పారు.

కాకినాడలో ఇండస్ట్రియల్ పార్క్: వెల్‌స్పన్ గ్రూప్‌కు ప్రతిపాదన

టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాల రంగంలో ప్రసిద్ధిగాంచిన వెల్‌స్పన్ వరల్డ్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. గతంలో దావోస్‌లో సీఎం చంద్రబాబుతో జరిగిన చర్చల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నంలో వెల్‌స్పన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. కాకినాడలో టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, పైపుల తయారీ, గ్రీన్ అమ్మోనియా యూనిట్లతో కూడిన ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నితిన్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలు, కడపలో తమ సంస్థ 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నిర్వహిస్తోందని, తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

నెల్లూరులో ఆయిల్ రిఫైనరీలు: గోకుల్ ఆగ్రోతో చర్చలు

వంట నూనెల తయారీలో పేరొందిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఇప్పటికే ఉన్న ప్లాంట్‌కు అదనంగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై కనుభాయ్ ఠక్కర్ స్పందిస్తూ.. కృష్ణపట్నంలో తమ ప్లాంట్ 2024 నుంచి ఉత్పత్తి ప్రారంభించిందని, దక్షిణాది మార్కెట్ల కోసం విస్తరణ ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విశాఖలో టైర్ల తయారీ యూనిట్: చిరిపాల్ గ్రూప్‌కు ఆహ్వానం

టెక్స్‌టైల్స్, కెమికల్స్ రంగాల్లోని చిరిపాల్ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ బ్రిజ్ మోహన్ చిరిపాల్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖపట్నం కనెక్టివిటీ, మౌలిక వసతులను వివరిస్తూ.. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బ్రిజ్ మోహన్ చిరిపాల్ స్పందిస్తూ.. ప్రస్తుతం తమకు పలు రాష్ట్రాల్లో తయారీ యూనిట్లు ఉన్నాయని, టైర్ల తయారీకి సంబంధించి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని అన్నారు.

డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి: ఎస్టీ టెలీమీడియాతో లోకేశ్

డేటా సెంటర్ల దిగ్గజం ఎస్టీ టెలీమీడియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ జెనాతో లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనిపై గౌతమ్ జెనా స్పందిస్తూ.. తమ సంస్థ కార్యకలాపాలను వివరించి, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు.

విశాఖలో ప్రీ ఫ్యాబ్ కేంద్రం: ఈప్యాక్ గ్రూప్‌తో భేటీ

ప్రీ ఫ్యాబ్ నిర్మాణ రంగంలో పేరొందిన ఈప్యాక్ గ్రూప్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో లోకేశ్ సమావేశమయ్యారు. డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన ప్రీ ఫ్యాబ్ నిర్మాణ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని కోరారు. భజరంగ్ బోత్రా మాట్లాడుతూ.. ఇప్పటికే శ్రీసిటీలో తమకు తయారీ యూనిట్లు ఉన్నాయని, విశాఖ ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

పైపుల తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి: ఆస్ట్రల్ పైప్స్‌తో సమావేశం

పైపుల తయారీలో అగ్రగామిగా ఉన్న ఆస్ట్రల్ పైప్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అల్కేష్ పంచల్‌తో మంత్రి లోకేష్ చర్చలు జరిపారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, కాకినాడ లేదా అనకాపల్లిలో పైపుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. అల్కేష్ పంచల్ స్పందిస్తూ.. తమకు దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు.. ఫారం 7 అంటే ఏమిటి?.. ఎప్పుడు వాడాలి?

అమరావతి: భారత ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనది. ఈ జాబితా కచ్చితంగా, పారదర్శకంగా ఉండటం ఎన్నికల నిష్పక్షపాతానికి పునాది. ఈ క్రమంలో, జాబితాలో అనర్హుల పేర్లను చేర్చడాన్ని నిరోధించడానికి లేదా ఇప్పటికే ఉన్న అనర్హుల పేర్లను తొలగించడానికి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పౌరులకు ఒక ముఖ్యమైన సాధనాన్ని అందించింది. అదే 'ఫారం 7'. దీని ద్వారా ఓటర్ల జాబితాలోని ఏదైనా పేరుపై అభ్యంతరం వ్యక్తం చేయవచ్చు లేదా తొలగింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ఫారం 7 అంటే ఏమిటి?.. ఎందుకు ఉపయోగిస్తారు?

రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం ఫారం 7ను రూపొందించారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం 6, వివరాలలో మార్పులకు ఫారం 8 ఉన్నట్లే, ప్రత్యేకంగా పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాల కోసం ఫారం 7ను కేటాయించారు. కింది సందర్భాలలో ఫారం 7ను ఉపయోగించవచ్చు:

ఓటరు మరణించినప్పుడు.

ఓటరు జాబితాలో పేరున్న వ్యక్తి శాశ్వతంగా వేరే ప్రాంతానికి నివాసం మార్చినప్పుడు. ఒకే వ్యక్తికి రెండు వేర్వేరు చోట్ల ఓటు హక్కు ఉన్నప్పుడు. జాబితాలోని వ్యక్తి భారత పౌరుడు కానప్పుడు. నిర్ణీత వయసు (18 ఏళ్లు) నిండకుండానే ఓటరుగా నమోదైనప్పుడు. ఒక వ్యక్తి తన పేరును స్వయంగా జాబితా నుంచి తొలగించుకోవాలనుకున్నప్పుడు కూడా ఫారం 7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎవరు, ఎలా దరఖాస్తు చేయాలి?

ఒక నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో నమోదైన ఏ ఓటరైనా, అదే జాబితాలోని మరో వ్యక్తి పేరుపై అభ్యంతరం తెలుపుతూ ఫారం 7ను దాఖలు చేయవచ్చు. దరఖాస్తుదారు తన పూర్తి వివరాలు (పేరు, ఓటరు గుర్తింపు కార్డు నంబర్, చిరునామా, ఫోన్ నంబర్) అందించాలి. అలాగే, ఎవరి పేరునైతే తొలగించాలని కోరుతున్నారో వారి వివరాలు, తొలగింపునకు గల కారణాన్ని స్పష్టంగా పేర్కొనాలి. ఈ ప్రక్రియను ఆన్‌లైన్‌లో ఎన్నికల సంఘం అధికారిక ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా లేదా 'బూత్ లెవల్ ఆఫీసర్' (బీఎల్‌ఓ) వద్ద ఆఫ్ లైన్‌లో పూర్తి చేయవచ్చు. దరఖాస్తు సమర్పించిన వెంటనే దరఖాస్తుదారుకు ఒక రసీదు ఇస్తారు.

విచారణ ప్రక్రియ ఎలా జరుగుతుంది?

ఫారం 7 దరఖాస్తు అందిన తర్వాత, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ) దానిని పరిశీలిస్తారు. అభ్యంతరం ఎవరి పేరు మీద అయితే వచ్చిందో, ఆ వ్యక్తికి నోటీసు పంపి, వివరణ ఇచ్చేందుకు అవకాశం కల్పిస్తారు. అనంతరం, క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సిందిగా బూత్ లెవల్ ఆఫీసర్‌ను ఆదేశిస్తారు. బీఎల్‌ఓ విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాత నివేదికను ఈఆర్‌ఓకు సమర్పిస్తారు. ఇరుపక్షాల వాదనలు, క్షేత్రస్థాయి నివేదిక ఆధారంగా ఈఆర్‌ఓ తుది నిర్ణయం తీసుకుంటారు. సరైన కారణాలు ఉన్నాయని నిర్ధారణ అయితేనే పేరును జాబితా నుంచి తొలగిస్తారు.

### తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు

ఫారం 7ను దుర్వినియోగం చేయడాన్ని ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తుంది. కేవలం రాజకీయ లేదా వ్యక్తిగత కక్ష సాధింపుల కోసం తప్పుడు సమాచారంతో ఫిర్యాదు చేయడం చట్టరీత్యా నేరం. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 31 ప్రకారం, ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రకటన చేసినట్లు రుజువైతే, గరిష్ఠంగా ఏడాది వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది. కాబట్టి, పౌరులు ఈ ఫారాన్ని బాధ్యతాయుతంగా ఉపయోగించి, నిజాయతీగల ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది.

## రాష్ట్రంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

హైదరాబాద్: రాష్ట్రంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణ అంటే కేవలం చలానాలు విధించడం, వసూలు చేయడమే కాకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం, అత్యవసర వైద్య సాయం అందించడమే లక్ష్యంగా 'తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో' ను ఏర్పాటు చేశారు. 'రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి' పరిధిలో ఈ కొత్త వ్యవస్థ ముఖ్యమంత్రి గారి పరిధిలో పనిచేస్తుంది. ఆ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో 135) జారీచేసింది. ఈ ప్రత్యేక విభాగం అదనపు డీజీపీ లేదా ఐజీపీ స్థాయి అధికారి నేతృత్వంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుంది. రాష్ట్రంలోని 32 వేల కిలోమీటర్లకు పైగా ఉన్న రహదారులు, 1.8 కోట్లకు పైగా ఉన్న వాహనాల రాకపోకలను ఈ బ్యూరో పర్యవేక్షిస్తుంది. రోడ్డు రవాణాతో పాటు మెట్రో, రైల్వే భద్రతను కూడా ఈ విభాగానికే అప్పగించారు. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతీ పోలీస్ స్టేషన్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఒక 'రోడ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ ఆఫీసర్'ను నియమిస్తారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి తరలించడం వీరి బాధ్యత. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు, 50 కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉన్న హైవేలపై స్పీడ్ డిటెక్టర్లు, అత్యాధునిక కెమెరాలతో కూడిన 'హైవే పెట్రోలింగ్ యూనిట్లు' ఏర్పాటు చేసి నిరంతరం పహారా ఇస్తారు. ఈ వ్యవస్థ నిర్వహణ కోసం ప్రత్యేకంగా 'ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఫండ్'ను ఏర్పాటు చేశారు. పోలీసులకు వచ్చే ట్రాఫిక్ జరిమానాల్లో 40% మొత్తాన్ని నేరుగా ఈ నిధికే మళ్లిస్తారు. ఈ నిధులను సిబ్బంది శిక్షణ, అధునాతన సాంకేతికత, పెట్రోలింగ్ వాహనాలు మరియు రహదారుల అత్యవసర మరమ్మతుల కోసం ఉపయోగిస్తారు.

## అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ విలువలను కాలరాస్తే న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవు

హైదరాబాద్: 'దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ విలువలను కాలరాస్తే న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో తేలిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది గట్టి గుణపాఠం' అని భారాస పక్ష ఉపనేత హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తనపై చేసిన క్షుద్రపూజల ఆరోపణలపై పరువు నష్టం దావా వేయడానికి ఆయన పార్టీ నేతలతో కలిసి నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు వచ్చారు. అనంతరం కోర్టు బయట విలేకరులతో మాట్లాడారు. "దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో' అంటూ రాజ్యాంగ పరిరక్షణ గురించి రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఆ మాటలను ఆచరణలో చూపించాల్సిన సమయం వచ్చింది. రాజ్యాంగంపై రాహుల్‌గాంధీకి నిజమైన నిబద్ధత ఉంటే.. కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన మిగతా ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించి.. ప్రజల తీర్పు కోరాలి. కాంగ్రెస్ చేసిన తప్పు, ఫిరాయింపుదారులను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించిన తీరు సుప్రీంకోర్టు తీర్పుతో బట్టబయలయ్యాయి' అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. "నేను క్షుద్రపూజలు చేశానంటూ కాంగ్రెస్ నేతలు మహేశ్‌కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్ అసత్య ప్రచారం చేస్తున్నారు. వారిపై ఆధారాలతో పరువు నష్టం దావా దాఖలు చేశా. వచ్చే బుధవారం స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తామని కోర్టు చెప్పింది. ఆలయాలకు వెళ్తే కూడా క్షుద్రపూజలు అంటూ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. గోబెల్స్ ప్రచారం చేస్తే వదిలిపెట్టం' అని స్పష్టంచేశారు.

## ఆసియా క్రీడల విజేతలకు సీఎం విజయ్ భారీ నజరానా



తమిళనాడు: ఆసియా క్రీడల్లో పతకాలు సాధించి దేశానికి, తమిళనాడు రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన అథ్లెట్లకు ముఖ్యమంత్రి విజయ్ భారీ నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడంలో ప్రభుత్వం ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. 4ఐ400 మీటర్ల మిక్స్‌డ్ రిలే రేసులో భారత్‌కు రజత పతకం అందించిన జట్టులోని తమిళనాడు అథ్లెట్లు విద్య రామరాజ్, విశాల్‌లకు చెరో రూ. 50 లక్షల నజరానా ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్ వేదికగా వెల్లడించింది. వీరికి తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ (ాణూూ)కి చెందిన 'ఎలైట్ స్పోర్ట్స్‌పర్సన్ స్కీమ్' కింద ఈ ఆర్థిక సాయం అందనుంది. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టులోని తమిళనాడు యువ క్రీడాకారిణి జి. కమలినికి విజయ్ రూ. 75 లక్షల నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. "4ఐ400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో రజత పతకం సాధించిన భారత అథ్లెట్లకు శుభాకాంక్షలు. నలుగురు సభ్యులున్న భారత జట్టులో ఇద్దరు తమిళనాడుకు చెందిన క్రీడాకారులు ఉండటం మన రాష్ట్ర క్రీడా రంగానికి గర్వకారణం. విద్య రామరాజ్, విశాల్ సాధించిన ఈ విజయం క్రీడల్లో రాణించాలనుకునే యువతకు గొప్ప స్ఫూర్తినిస్తుంది. భవిష్యత్‌లో వీరిద్దరూ మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి తమిళనాడుతో పాటు భారత్‌కు మంచి పేరు తీసుకురావాలి" అని సీఎం విజయ్ ప్రశంసించారు. 4ఐ400 మీటర్ల మిక్స్‌డ్ రిలే విభాగంలో విద్య రామరాజ్, విశాల్, మను, పూవమ్మలతో కూడిన భారత బృందం 3:14.46 సెకన్లలో రేసును పూర్తి చేసి రజతాన్ని కైవసం చేసుకుంది. బహ్రెయిన్ జట్టు 3:12.87 సెకన్ల టైమింగ్‌తో గేమ్స్ రికార్డు నమోదు చేస్తూ స్వర్ణాన్ని గెలుచుకుంది. ఆసియా క్రీడల మిక్స్‌డ్ రిలే విభాగంలో భారత్‌కు ఇది వరుసగా మూడో పతకం కావడం విశేషం. 2018లో స్వర్ణం, 2022లో రజతం గెలిచిన భారత జట్టు, మరోసారి రజత పతకంతో మెరిసింది.

## వర్షాలు తగ్గే వరకు పూర్తి అప్రమత్తత అవసరం



అమరావతి: 'కాకినాడ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున యంత్రాంగం మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి. వానలు పూర్తిగా తగ్గేవరకు జాగ్రత్తలు తీసుకోవాలి. లోతట్టు ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాలి. అవసరమైతే ముంపు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌తో ఫోన్లో మాట్లాడి అక్కడి పరిస్థితులు తెలుసుకున్నారు. 'రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 117.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. 15 చోట్ల రోడ్లపై చెట్లు కూలడంతో అగ్నిమాపక సిబ్బంది సహకారంతో వాటిని తొలగించాం. ప్రాథమిక అంచనాల మేరకు జిల్లాలో 1,885 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది' అని కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టం వివరాలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని పవన్‌కల్యాణ్ ఆదేశించారు.

## వరదనీటితో జలాశయాలన్నీ నింపాలి

అమరావతి: భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరదల్ని ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ.. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని నిర్దేశించారు. ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి చక్కదిద్దాలి. దెబ్బతిన్న రహదారుల్ని పునరుద్ధరించాలి. కొండచరియలు విరిగిపడేచోట నివాసితుల్ని అప్రమత్తం చేయాలి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి' అని ఆదేశించారు. భారీ వర్షాలు, వివిధ జిల్లాల్లో పరిస్థితిపై వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో, ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షలో సీఎం మాట్లాడారు.

గోదావరి, నాగావళి, వంశధార పరివాహకంలో వర్షాలు

వరద ప్రవాహం పెరుగుతుండటంతో భద్రాచలం వద్ద 26వ తేదీ (శనివారం) మధ్యాహ్నానికి ప్రమాదస్థాయి -1, అదే రోజు రాత్రికి ప్రమాదస్థాయి-2 దాటే అవకాశం ఉందని అధికారులు చంద్రబాబుకు వివరించారు. 'గోదావరి పరీవాహకంలోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ తదితర రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు కూడా రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరుగుతుంది. నాగావళి, వంశధార బేసిన్లలో వర్షాల ప్రభావంతో ప్రవాహాలు పెరిగే అవకాశం ఉంది. గొట్టా బ్యారేజీ వద్ద శుక్రవారం ఉదయానికే వార్నింగ్ లెవల్-1 చేరుకునే అవకాశం ఉంది' అని అధికారులు చెప్పారు. చంద్రబాబు మాట్లాడుతూ.. 'కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు వాటి పరిధిలోని వివిధ నీటి వనరుల్ని నింపాలి. అవసరమైన చోట మొబైల్ లిఫ్ట్‌లు, మోటార్లు వాడి నీటిని ఎత్తిపోయాలి. గోదావరి వరద ప్రవాహం ద్వారా 24 టీఎంసీల నీటితో ఏలేరు రిజర్వాయర్ నింపాలి. పోలవరం ఎడమకాలవ ద్వారా అనకాపల్లి వరకు నీటిని సరఫరా చేయాలి' అని సూచించారు.

## ఖైరతాబాద్‌లో భాజపా విజయం ఖాయం



హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్, భారాసలకు చెంపపెట్టు లాంటిదని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. దానం కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని కేసీఆర్ ప్రభుత్వం వారిని చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని, అదే రీతిలో భారాస ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయించిందన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఈ రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని, భాజపాదే ఘనవిజయమని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో భాజపా గెలుపు తథ్యమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. దానం వ్యవహారంలో.. కాంగ్రెస్, భారాసలు ఎవరికి వారే తమ విజయంగా భావించడం హాస్యాస్పదమని సంజయ్ అభిప్రాయపడ్డారు. అవకాశవాద రాజకీయాల కోసం ఫిరాయింపులను ప్రోత్సహించే పార్టీలకు ఇది తగిన గుణపాఠమన్నారు.

హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయమని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేఎల్‌పీ చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం దక్కిందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

రాజ్యాంగానికి తలవంచాల్సిందే: రామచందర్‌రావు

దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎంతటివారైనా రాజ్యాంగానికి తలవంచాల్సిందేనన్నారు. ఫిరాయింపులను నిరోధించాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి.. వాటిని ప్రోత్సహిస్తుండడం సరికాదని అన్నారు.

## ఐసీసీ చైర్మన్ జైషాతోమంత్రి నారా లోకేష్, ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని చిన్ని, ఏ సి ఏ సెక్రటరీ ఎంపీ సాన సతీష్ బాబు భేటీ

**ఏపీలో క్రికెట్ విస్తరణ, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధిపై కీలక చర్చ**



విజయవాడ, సెప్టెంబర్ 25 (నేటి శుభోదయ):-ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా రంగానికి బలమైన పునాది వేయడం, రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్‌ను విస్తరించడం లక్ష్యంగా అహ్మదాబాద్‌లో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాజ్యసభ సభ్యుడు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సానా సతీష్ బాబుతో కలిసి ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్ జైషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. విశాఖపట్నంను క్రీడా కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడం, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు క్రికెట్‌ను విస్తరించడం, గ్రామస్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. అదేవిధంగా మహిళా క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించడం, మహిళా క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్‌కు అవసరమైన శిక్షణా వేదికలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కూడా చర్చించారు.ఆంధ్రప్రదేశ్‌లోని క్రికెట్ స్టేడియంల అభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధునీకరణ, క్రీడాకారులకు మెరుగైన శిక్షణా సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలను ఏసీఏ అధ్యక్షుడు చిన్ని ఐసీసీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల అభివృద్ధిపై ఐసీసీ చైర్మన్ జైషా కలిగిన ముందుచూపు, దార్శనికత ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. క్రీడా రంగంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడం వంటి అంశాల్లో జైషా సూచనలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్‌ను నగరాలకే పరిమితం చేయకుండా గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు విస్తరించే దిశగా ఏసీఏ కృషి చేస్తుందని చిన్ని తెలిపారు. మహిళా క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు రాష్ట్రంలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. క్రీడా అంశాలపై చర్చతో పాటు, విజయవాడలో దసరా శరన్నవరాత్రి వేడుకలకు ఐసీసీ చైర్మన్ జైషాను ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ ప్రత్యేకంగా ఆహ్వానించారు. విజయవాడలో ఘనంగా నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని జైషాను కోరారు. అదేవిధంగా విజయవాడ నగర ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటి చెప్పేలా నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్‌కు కూడా జైషాను ప్రత్యేకంగా ఆహ్వానించారు. విజయవాడ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆధ్యాత్మిక వైభవాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేసేలా విజయవాడ ఉత్సవ్‌ను నిర్వహించనున్నట్లు చిన్ని వివరించారు.క్రీడా రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు విజయవాడ నగర సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని కేశినేని శివనాథ్ తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్

**-మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు**



విజయవాడ, సెప్టెంబర్ 25 (నేటి శుభోదయ):- ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్. (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం) ప్రజాదర్బార్ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం పాల్గొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యే కృష్ణప్రసాదును కలిసి తమ సమస్యలను వివరించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, ఇళ్ల స్థలాలు, సామాజిక పింఛన్లు తదితర అంశాలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే వారి సమస్యలను సావధానంగా విని, వివరాలను తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి, నిబంధనల మేరకు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారం చూపించడమే ప్రజాదర్బార్ ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తూ పి.జి.ఆర్.ఎస్. ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు పంపించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారం కోసం అధికారులతో సమన్వయం చేస్తూ నిరంతరం కృషి చేస్తామని కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## గ్రామీణ ప్రాంత ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది ఆర్‌ఎంపి వైద్యుడే

**చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య**




ఒంగోలు, సెప్టెంబర్ 25 నేటి శుభోదయ: గ్రామీణ ప్రాంతాల్లో రుగ్మతకు గురైన ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది ఆర్‌ఎంపి వైద్యుడేనని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. శుక్రవారం ఒంగోలులోని బృదావన్ కల్యాణ మండపంలో జరిగిన ఆర్. ఎం. పి. వైద్యుల రాష్ట్ర మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తాను కనిగిరిలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తే 15000 మంది ప్రజలు ఆ క్యాంపును వినియోగించుకున్నారని, అందుకు ప్రధాన కారణం క్వాలిఫైడ్ వైద్యులకు సహకారం అందించిన ఆర్‌ఎంపి వైద్యులని అన్నారు. తమ వృత్తి తో పాటు ప్రజాహిత కార్యక్రమాలు కూడా చేపట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తన వాణిని వినిపిస్తానని సభి కుల హర్షద్వానాల మధ్య ప్రకటించారు. ఫెడరేషన్ గౌరవ సలహాదారు లంక దాసరి ప్రసాదరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల మనసులు చూరగొన్న ఆర్‌ఎంపీ వైద్యుడు కొన్ని విమర్శలకు గురవుతున్నాడని దానికి కారణం కూడా అతని వైద్యం అందించే తీరు అని అన్నారు. అధిక వైద్యానికి పాల్పడుతున్నారని అనగా జ్వరాలు వచ్చినప్పుడు డెంగ్యూ టెస్ట్ చేయించడం అదేవిధంగా హై యాంటీబయోటిక్స్ ఇంజక్షన్లు మందుల రూపంలో వాడమని సూచించడం తప్పన్నారు. తెలంగాణ గ్రామీణ వైద్యుల పై జరుగుతున్న దాడులను, అందుకు గల కారణాలను గ్రహించి ఎవరికీ హాని జరగకుండా ప్రాథమిక వైద్యం చేసుకోవాలన్నారు.సభకు ఫెడరేషన్ అధ్యక్షులు యామర్తి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా కార్యదర్శి కరెళ్ల గణపతిరావు అతిథులను సభకు పరిచయం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్‌ఎంపి వైద్యులతో పాటు రాష్ట్రంలోని ఫెడరేషన్ నాయకులతో పాటు ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు కోలా వెంకటేశ్వరరావు, కోశాధికారి సి ఎస్ కుమార్, కాటూరి వరప్రసాద్, కరేళ్ల ముక్తేశ్వర రావు, దాసు వెంకట నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, డివిఎస్ రాజు,గళ్ళా మురళి తదితరులు పాల్గొన్నారు.

## జగన్ కు ప్రజలు బుద్ధి చెప్పినా ఏమీ మార్పు లేదు

**గురువులుగా భావించే టీచర్లను రోడ్డు మీదకు తెచ్చి వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారు..**

**గతంలో జగన్ రెడ్డి ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్దా కాపలా ఉంచారు**

**మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 25 నేటి శుభోదయ : గురువులుగా భావించే ఉపాధ్యాయుల మనోభావాలను జగన్ రెడ్డి రోడ్డుమీదకు తెచ్చి వారిని అవమానిస్తున్నారని, గతంలో ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్ద కాపలా ఉండే విధంగా వ్యవహరించారని ప్రజలు సాధారణ ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఆయనలో ఎటువంటి మార్పు రాలేదని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి విమర్శించారు. అనంతపురం నగర సమీపంలో ఉన్న ఆమె కార్యాలయంలో మాట్లాడారు. గత 2024 సాధారణ ఎన్నికల్లో ప్రజలు ఆయనకు 11 సీట్లు మాత్రమే ఇచ్చారని కనీసం ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా లేదని వచ్చే ఎన్నికల్లో జగన్కు సింగిల్ డిజిట్ కూడా రాదని ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని అయితే తెలుగుదేశం ప్రభుత్వంలో పేద విద్యార్థులు కష్టపడి రాత్రింబవళ్లు చదివి డీఎస్సీ ద్వారా వారు సెలెక్ట్ అయినా వారిని అడ్డుకుంటున్నారని ప్రశాంతంగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న స్పోర్ట్స్ కోటా టీచర్లు ఒకవైపు, రౌడీలు, గుండాలతో టీచర్లను బూతులు తిట్టిస్తూ రాళ్లు కర్రలు వాటర్ బాటిల్లతో దాడి చేయిస్తున్న గొడ్డలి పార్టీ నేతలు మరోవైపు ఎవరిది అరాచకం జగన్ అంటూ ప్రశ్నించారు. జగన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని ఆమె విమర్శించారు.

## రికార్డు స్థాయిలో చెక్కులు పంపిణీ రాజానగరం చరిత్రలోనే మైలురాయి..!!

**- ఎమ్మెల్యే 'బత్తుల' ఆధ్వర్యంలో ఒకే రోజు, ఒకే వేదికపై రూ. 1,07,54,142 ల విలువైన 264 సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు..!!**

**- వైద్య ఖర్చులకు ఆర్థిక భరోసా... బాధిత కుటుంబాలకు కొండంత అండ..**



కోరుకొండ, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); నియోజకవర్గ ప్రజల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా... ప్రతీ పేద కుటుంబానికి అండగా నిలిచే దిశగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యమంత్రి సహాయనిధి (సి.ఎం.ఆర్.ఎఫ్.) నుంచి రికార్డు స్థాయిలో నిధులు మంజూరు చేయించి లబ్ధిదారులకు అందించడం చరిత్ర సృష్టిస్తుంది. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పూర్తి సహకారంతో..నియోజకవర్గ ప్రజల ఆరోగ్య భద్రతే కోసం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేయించారు. ఆయన కృషీ, ప్రత్యేక చొరవ మరియు సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 1,07,54,142 లు, విలువగల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఈ నెల 27 ఆదివారం అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే బలరామకృష్ణ, మహిళా నాయకురాలు శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఈ చెక్కులను అందించనున్నారు. కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో వెలసిన ఓం శివ శక్తి పీఠం - శంబాల నగరం కళ్యాణమండపం ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సి.ఎం.ఆర్.ఎఫ్., ఎల్.ఓ.సి. లబ్ధిదారులు హాజరు కావలసిందిగా ఎమ్మెల్యే బలరామకృష్ణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## పాఠశాల విద్యార్థులు అందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్.**



అనంతపురం, సెప్టెంబర్ 25 నేటి శుభోదయ: పాఠశాల విద్యార్థులు అందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలు మరియు రక్తహీనత నుంచి పిల్లలను కాపాడేందుకు ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని సూచించారు. విరేచనాలు వంటి ఆరోగ్య సమస్యల వల్ల పిల్లలు తరచూ బడికి దూరమవుతుంటారని, సరైన పోషకాహారం శరీరానికి అందించి, మంచి ఎత్తు, బరువు మరియు బలం పెరగాలంటే ఈ మాత్రలు వేసుకోవడం అత్యంత అవసరం అన్నారు. ఉపాధ్యాయులు మరియు ఆరోగ్య సిబ్బంది సమక్షంలో ప్రతి విద్యార్థికి వ్యక్తిగతంగా మాత్రలు అందించి, వారు వేసుకునేలా (మింగేలా) చూస్తారని, ఎవరూ కూడా మాత్రలను పక్కన పడేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారని, ఈ మాత్రల వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదని, ఇవి సురక్షితమైనవన్నారు. పిల్లలు చదువుతో పాటు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని, పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనాన్ని బాగా తిని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి జి.ఎన్.ఎస్.రెడ్డి, ఇంచార్జి తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడిఓ దేవదాసు, ఆర్బికే పిఓ డాక్టర్ విష్ణుమూర్తి, మెడికల్ ఆఫీసర్ నవీన్ కుమార్, ఎంఈఓ, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ బాధ్యతల స్వీకరణ..



అనంత పురం సెప్టెంబర్ 25 నేటి శుభోదయ: అనంతపురం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ బాధ్యతలను స్వీకరించారు. గురువారంతో జిల్లా పరిషత్ పాలకవర్గ పదవీకాలం ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనంతపురము జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ బాధ్యతలను స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి..

**- కోరుకొండ సీఐ ఎస్ వి వి మూర్తి**



కోరుకొండ, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);కోరుకొండ సర్కిల్ పరిధిలోని మూడు మండలాల ప్రజలకు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.వి. మూర్తి హృదయ పూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గత పది రోజులుగా మూడు మండలాల పరిధిలో వినాయక ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు.ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొన్ని వినాయక విగ్రహాల ఊరేగింపులు, నిమజ్జనాలు వాయిదా పడ్డాయని, వాటిని శని, ఆదివారాల్లో వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు.వర్షాల కారణంగా చెరువులు, నీటి వనరుల్లో నీటి మట్టం పెరిగినందున నిమజ్జన సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విగ్రహాలను నీటిలోకి తీసుకెళ్లకుండా క్రేన్ సహాయంతో నిమజ్జనం చేయాలని సి.ఐ. మూర్తి కోరారు.అలాగే వర్షాల నేపథ్యంలో విద్యుత్ వైర్లు, విద్యుత్ పరికరాలను తాకరాదని, ఊరేగింపుల్లో విద్యుత్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. వీలైనంత వరకు అన్ని విగ్రహాల నిమజ్జనాలను సాయంత్రం 6 గంటల్లోపు, సూర్యాస్తమయానికి ముందే పూర్తి చేసుకోవాలని తెలిపారు.ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించాలని సీఐ ఎస్.వి.వి. మూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎస్సై ఆర్ శివాజీ పాల్గొన్నారు.

## గుడివాడలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహణ

**-ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ బాలాజీ**



-అర్జీలు అందించిన వారి సమస్యలను అర్జీదారులతో కలిసి కలెక్టర్ కు వివరించిన ఎమ్మెల్యే రాము

గుడివాడ: సెప్టెంబర్ 25 నేటి శుభోదయ: నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకునే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో నియోజకవర్గస్థాయి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, గుడివాడ నియోజకవర్గ శాసన సభ్యుడు వెనిగండ్ల రాముతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను ఓపికగా విని వివరాలను తెలుసుకున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించారు.సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులను పిలిపించి, అర్జీదారుల సమస్యలను వివరించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అర్జీలను నిర్ణీత గడువులో పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యతనిస్తూ, సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయానికి సమస్యలను పరిష్కరించి, అర్జీదారులకు తగిన సమాచారం అందించాలని ఆదేశించారు.నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రత్యేక వేదికను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. రాబోయే మూడు శుక్రవారాలు కూడా నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్డిసి పి నీలకంతేశ్వరరెడ్డి, గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్ రావు, డీపీఓ ఎం ధనలక్ష్మి, డీఎస్పీ పాల శ్రీనివాసరావు, డిఎల్డిఓ సునీత శర్మ,సర్వే ఏడి లక్ష్మణరావు, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్ బాబు తదితర శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## బుడమేరుకు పెరిగిన వరద ఉధృతి

**-గుడివాడ-హనుమాన్ జంక్షన్ మధ్య రాకపోకలు నిలిపేసిన పోలీసులు**



గుడివాడ, సెప్టెంబర్ 25 నేటి శుభోదయ: కృష్ణా జిల్లా నందివాడ మండలం పుట్టగుంట వంతెన వద్ద బుడమేరుకు వరద ఉధృతి పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో వంతెన వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవాహం కొనసాగుతోంది.వరద ప్రవాహం ప్రమాద స్థాయికి చేరడంతో గుడివాడ--హనుమాన్ జంక్షన్ మధ్య రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచించారు. వరద ప్రవాహం పరిస్థితిని పరిశీలించిన అనంతరం రాకపోకలు నిలిపివేయాలని గుడివాడ డీఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత రాకపోకలకు అనుమతి ఇస్తామన్నారు.



## జిల్లా అభివృద్ధిలో ప్రజా పరిషత్ పాత్ర ఎంతో కీలకం

-ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ




మచిలీపట్నం, సెప్టెంబర్ 25 నేటి శుభోదయ : కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రత్యేక అధికారిగా విధులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సతీమణి పృథ్వీ కళ్యాణితో కలిసి హాజరయ్యారు. ఆయన తండ్రి కృష్ణయ్య శెట్టి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా సమగ్ర అభివృద్ధిలో జిల్లా ప్రజా పరిషత్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన సంస్థగా ప్రజా పరిషత్‌కు ఉన్న బాధ్యతలను ప్రజా ప్రయోజనాలను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న వనరులు, అభివృద్ధి అవసరాలు, ప్రజలకు అందుతున్న సేవలను సమగ్రంగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అంశాలపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించి, జిల్లా అభివృద్ధికి ప్రజా పరిషత్ ద్వారా చేపట్టాల్సిన పనులు, కార్యక్రమాలను గుర్తిస్తామని పేర్కొన్నారు.ప్రజల అవసరాలు, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ప్రజా ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా జిల్లా ప్రజా పరిషత్ బాధ్యతలను చిత్తశుద్ధితో, సమర్థవంతంగా నిర్వర్తిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కే శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో డాక్టర్ జే అరుణ, డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ




గుంటూరు, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: గుంటూరు జిల్లాలోని పేరిచర్లలో ఇంటెల్ హైస్కూల్‌లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను మై భారత్ ఆధ్వర్యంలో, పేస్ సొసైటీ సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటెల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ విజయరావు, పేస్ సొసైటీ కార్యదర్శి పి. రమేష్, హుస్సేన్, పీడీ, శ్రావంతి తదితరులు అతిథులుగా పాల్గొనగా, ఈ సందర్భంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీవితం, ఆయన సిద్ధాంతాలు, దేశానికి ఆయన అందించిన సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు యువత దేశ నిర్మాణంలో చురుకుగా పాల్గొనాలని, దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆదర్శాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం కావడంలో మై భారత్ వాలంటీర్లు, పేస్ సొసైటీ సభ్యులు, పాఠశాల యాజమాన్యం కీలక పాత్ర వహించారు.

## గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యానికి ఘన నివాళి



ఒంగోలు, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: గాన గంధర్వుడు, పద్మభూషణ్ డాక్టర్ ఎస్.పి. బాలసుబ్రమణ్యం ఆరవ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలు నగరంలోని స్థానిక సివిఎన్ రీడింగ్ రూమ్ నందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ది ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమైక్య మరియు బాలు కళా స్రవంతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో, అధ్యక్షులు ఎస్కే బాబు మరియు నక్క సుకుమార్ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మరియు పాల్గొన్న ప్రముఖులు బాలు గారి సేవలను స్మరించుకున్నారు. "శంకరాభరణం" చిత్రంలోని 'శంకరా నాదశరీరాపర', "సాగరసంగమం" చిత్రంలోని 'తకిట తధిమి', "స్వాతిముత్యం" లోని 'లలిత ప్రియ కమలం', "సిరివెన్నెల" లోని 'విధాత తలపున', అలాగే 'జాబిల్లి కోసం ఆకాసమల్లే', 'నా చెలి రోజావే' "రుద్రవీణ" లోని 'తరలి రాద తనే వసంతం', "దళపతి" లోని 'సుందరి నువ్వే తొందరపడితే', "గ్యాంగ్ లీడర్" లోని 'పాలబుగ్గ', "ప్రేమికుడు" లోని 'ఊర్వశి ఊర్వశి' వంటి భక్తి, యుగళ, వేదాంత, విరహ గీతాలేవైనా తన స్వరం ద్వారా ప్రాణం పోసి, భావాలను శ్రోతల హృదయాలకు నేరుగా చేర్చడం ఒక్క ఎస్పీబికే సాధ్యమైందని కొనియాడారు. తరాలు మారినా, సంగీత ప్రపంచం ఉన్నంత కాలం ఆయన గొంతు అమరంగా ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని వ్యాఖ్యానించారు.వంటి వేలాది అమర గీతాలతో కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాల్లో ఎస్పీబి శాశ్వత స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆలపించిన మధురమైన పాటల రూపంలో ఎల్లప్పుడూ జీవించే ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలు గారి బహుముఖ ప్రజ్ఞను, చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలను వక్తలు గుర్తుచేసుకున్నారు. కేవలం గాయకుడిగానే కాకుండా సంగీత దర్శకుడిగా, నటుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా మెప్పించిన ఆయన ఐదు దశాబ్దాలకు పైగా 40,000 పైగా పాటలు పాడి ప్రపంచ రికార్డు సృష్టించారని తెలిపారు.ఈ నివాళి కార్యక్రమంలో గాయని గాయకులు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, ఏల్చూరి అనంతలక్ష్మి, సిహెచ్. శేషారత్నం, యశోద, నిర్మలమ్మ, శ్రీదేవి, సంపూర్ణ కాళహస్తి, మనోహర్, పాండురంగనాథం, అంగలకుర్తి ప్రసాద్, మోహనరావు, యిర్మియా, నాగేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

## బుడమేరుకు వరద ఉధృతి.. ప్రమాద స్థాయిలో వరద ప్రవాహం

-నీట మునిగిన పరివాహక పంట పొలాలు



నందివాడ, సెప్టెంబర్ 25 నేటి శుభోదయ: బుడమేరు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. నందివాడ మండలంలో బుడమేరు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు వచ్చి చేరడంతో బుడమేరు పరివాహక ప్రాంతంలోని పంట పొలాలు నీటమునిగాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.పుట్టగుంట వద్ద బుడమేరు వంతెనపై సుమారు అడుగు ఎత్తున వరద నీరు ప్రవహిస్తోంది. ఎగువ నుంచి భారీగా కొట్టుకొస్తున్న గుర్రపుడెక్క వంతెన వద్ద పేరుకుపోవడంతో వరద ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.దీంతో అధికారులు ప్రొక్లైనర్లతో గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. వరద ఉధృతి తగ్గకపోతే గుడివాడ--హనుమాన్ జంక్షన్ మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

# మాట తప్పితే అక్టోబర్ 3 తర్వాత నిరవధిక సమ్మె

**ప్రభుత్వానికి కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగుల హెచ్చరిక**

**నగరంలో రాయలసీమ జోనల్-4 గర్జన కార్యక్రమం**

**వందలాది కాంట్రాక్టు ఉద్యోగులతో భారీ ప్రదర్శన**

**గత ప్రభుత్వంలో లా మోసం చేయవద్దు.. ఛైర్మన్ కోటేశ్వరరావు. హామీ ఇచ్చి 20రోజులు గడిచినా స్పందన లేదు.. శ్రీదేవి**



అనంత పురం సెప్టెంబర్ 25 నేటి శుభోదయ : ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సుదీర్ఘకాల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ఇచ్చిన గడువు ముగుస్తున్నా కనీస స్పష్టత ఇవ్వడం లేదని నాయకులు మండిపడ్డారు. ఈ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం అనంతపురం నగరంలో నిర్వహించిన రాయలసీమ జోనల్ (జోన్-4) వైద్యోద్యోగుల గర్జన ,మహాసభ వందలాది మంది ఉద్యోగులతో సాగింది. సమావేశానికి ముందు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సప్తగిరి సర్కిల్ నుండి ప్రారంభమైన భారీ నిరసన ర్యాలీ నగర వీధుల్లో ఉవ్వెత్తున సాగింది. ఉమ్మడి రాయలసీమ జిల్లాల నుండి తరలివచ్చిన కాంట్రాక్ట్ నర్సులు, పారామెడికల్, ఫార్మసీ, ల్యాబ్ అసిస్టెంట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను గట్టిగా వినిపించారు. అనంతరం యాదవ్ భవన్ లో మహాసభ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులంతా హాజరై ఉద్యమంపై దిశా నిర్దేశ్యం చేశారు. జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇంతకుముందు నర్సులు, పారామెడికల్, ఫార్మసీ, ల్యాబ్ అసిస్టెంట్లు విడివిడిగా పోరాటాలు చేసేవారన్నారు.. కానీ ఇప్పుడు తమ హక్కుల కోసం 15 వేల మంది ఉద్యోగులు ఏకతాటిపైకి వచ్చి జాయింట్ యాక్షన్ కమిటీ గా ఏర్పడ్డారన్నారు. రాజకీయ నాయకుల నుండి అధికారుల వరకు అందరికీ వినతిపత్రాలు ఇచ్చిన ఫలితం లేదన్నారు. గతంలో 45 రోజులు టైమ్ ఇచ్చినా ఎవరూ స్పందించలేదని.. అందుకే 15 రోజులు ఉద్యమం చేస్తే.. ప్రభుత్వం చర్చలకు పిలిచి నాన్-ఫైనాన్షియల్ అంశాలు క్లియర్ చేస్తామన్నారు. మిగిలినవి సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని..హామీ ఇచ్చారన్నారు. ఆర్థికపరమైన డిమాండ్లపై ఇప్పటివరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కానీ, అధికారులు కానీ ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదన్నారు. అధికారులంతా ఫైల్స్ కదిలించి.. సీఎం నిర్ణయం తెలియజేస్తేనే మా తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు. మాకు బేసిక్ వేతనం చాలా తక్కువగా ఉందని.. మిగిలిన వారికి ఎక్కువగా ఉందన్నారు. దీనివల్ల మేము వెట్టిచాకిరి చేస్తున్నట్లు ఉందన్నారు. ఈ తారతమ్యాలు తొలగించి మాకు 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తే వాడుకుని మోసం చేశారన్నారు. ఈ ప్రభుత్వంపై మాకు నమ్మకం ఉందని.. గత ప్రభుత్వంలా మోసం చేయరని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్టు నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ మా ఉద్యమంపై ఇటీవల ప్రభుత్వం స్పందించి..నెలరోజుల గడువు అడిగారని.. ఇప్పటికే 20 రోజులు గడిచిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అందుకే ఈ భారీ ర్యాలీ నిర్వహించి.. మా నిరసనను తెలియజేసినట్టు చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని. ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు అందరికీ 100% గ్రాస్ వేతనం ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం కల్పించాలన్నారు. ఈపీఎఫ్, పరస్పర బదిలీల వంటి డిమాండ్లు పరిష్కరించాలన్నారు. అక్టోబర్ 3వ తేదీ వరకు గడువు కోరారు.కానీ ఇంతవరకు ఎలాంటి జీఓలు విడుదల చేయలేదన్నారు. అక్టోబర్ 3 లోగా రెగ్యులరైజేషన్‌పై స్పష్టమైన ఆదేశాలు ఇస్తే సమ్మె విరమించుకుంటామని.. లేకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. ఇప్పటికే రెండు నెలలుగా నిరసనలు తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యలు పరిష్కరించడానికి చేతులు రావడం లేదన్నారు. వీరంతా 20 నుండి 25 ఏళ్లుగా కాంట్రాక్ట్ లోనే మగ్గిపోతున్నారన్నారు. కోవిడ్ కష్టకాలంలో కూడా ప్రాణాలను పణంగా పెట్టి ఇబ్బందులు ఎదుర్కొన్నారని.. గత ప్రభుత్వమైనా, ప్రస్తుత ప్రభుత్వమైనా వీరిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమాన పనికి సమాన వేతనం కింద వీరికి 100 శాతం వేతనం ఇవ్వాల్సిందేనన్నారు. ప్రభుత్వం ఇంకా దీన్నిఇలాగే నాన్చితే నిరవధిక సమ్మెకు వెళ్తారని.. దానికి మా పూర్తి మద్దతు ఉంటుందన్నారు... ఈ కార్యక్రమంలో ఏపీ ఎం.ఎల్.టి అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు మాధవ్, ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు శరత్, జేఏసీ కో ఛైర్మన్ వెంకట్, ఏపీజీసీఎన్ఏ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినోద్, ప్రశాంతి, లావణ్య, సుజేంద్ర, చాందిని, వెంకటేష్ నాయక్, శ్రీకాంత్, వలీ మహేష్, కాంట్రాక్ట్ నర్సులు, ఎక్స్ రే, ఓటీ, ఈసీజీ టెక్నిషీయన్లు తదితరులు పాల్గొన్నారు...

## భారీ వర్షాలపై అధికారులతో ఎమ్మెల్యే 'బత్తుల' సమీక్ష..!!

- వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం.!



కోరుకొండ, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);భారీ వర్షాల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితిపై రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరుకొండ ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.లోతట్టు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, పొలాలు, కాలనీల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు డీవాటరింగ్ చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, మంచినీరు, వైద్య సదుపాయాలు మెరుగ్గా కల్పించాలని, ఆస్తి, పంట నష్టం జరిగిన చోట నివేదికలు రూపొందించి తక్షణ పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరంగపట్నంలో సుమారు 300 కుటుంబాలు డ్రైనేజీ నీరు వెళ్లక ఇబ్బంది పడుతున్నాయని, వారిని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. కోరుకొండ మండలంలో సుమారు 1200-1300 ఎకరాల్లో పంట మునిగిందని, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా నష్టం అంచనా వేసి కలెక్టర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా నియోజకవర్గంలో ప్రజలకు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో సేవలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే బలరామకృష్ణ స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఎంపీడీఓ, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, హార్టికల్చర్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జ్ఞానేశ్వర్ ప్రజాస్వామ్య ద్రోహి

- సామాన్యులే లక్ష్యంగా కేంద్రం పన్ను

భూ లొల్లిలో ప్రజా సమస్యలు పక్కదారి

- ప్రజా సంఘాల సమావేశంలో బాగం




ఖమ్మం, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యులు జ్ఞానేశ్వర్ మిశ్రా ప్రజాస్వామ్య ద్రోహి అని అతన్ని వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేవిధంగా -వ్యవహరించిన జ్ఞానేశ్వర్పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పక్కనపెట్టి బిజెపికి అనుకూలంగా వ్యవహరించి ఫలితాలను తారుమారు చేసిన జ్ఞానేశ్వర్ భారతదేశ ఎన్నికల చరిత్రకు తీరని కలంకాన్ని తీసుకు వచ్చారన్నారు. బిజెపి మూడవ సారి గెలుపు కోసం అడ్డదారులు తొక్కిందని -ఆది నుంచి ఆరోపిస్తున్నట్లుగానే ఎన్నికల కమిషన్ ఏర్పాటులో కొత్త నిబంధనలను తీసుకు వచ్చిందన్నారు. 2004 పార్లమెంటు ఎన్నికల -ఫలితాలతో పాటు జ్ఞానేశ్వర్ ఎన్నికల సంఘం బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికలను రద్దు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉన్న భారత్లో లో ఈవిఎంల ద్వారా ఫలితాన్ని మార్చివేశారని ప్రజల అభిప్రాయం ప్రస్ఫూటం కాలేదన్నారు. జ్ఞానేశ్వర్ను తొలగించాలని దేశ వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు -ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా పన్నులు విధిస్తుందని గతంలో జిఎస్టి పేరుతో దోపిడీ చేసిన ప్రభుత్వం యుపిఐ ఛార్జీల ద్వారా ప్రజల నడ్డివిరిచేందుకు ప్రయత్నిస్తుందని హేమంతరావు తెలిపారు. బిజెపి దేశ ప్రజల పక్షాన కాకుండా కార్పొరేట్ల పక్షాన పాలన చేస్తుందని అతి కొద్ది మంది కోసమే మోడీ ప్రధానిగా వ్యవహరిస్తున్నారన్నారు. మోడీ 12 ఏళ్ల పాలనలో పేద, సామాన్య ప్రజలకు అనుకూలంగా ఒక చట్టం తేకపోగా అనుకూలంగా ఉన్న చట్టాలను మార్పు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేవిధంగా వ్యవహరిస్తుందని గడిచిన కొన్ని రోజులుగా భూ సమస్యలు ముఖ్యంగా 22ఎ పై రాష్ట్రం అట్టుడుకుతుందని ఆయన తెలిపారు. భూ సమస్యకు నిర్దిష్ట పరిష్కారం చూపాలని మూడు ప్రధాన పార్టీలు -అయినా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పరస్పర ఆరోపణల నడుమ ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయని హేమంతరావు తెలిపారు. ప్రజా -సమస్యలు చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత దూషణ బీషణలు ఎజెండాపైకి వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని సరైన -రీతిలో అమలు చేయలేదని ముఖ్యంగా పింఛన్లు, ఇందిరమ్మ భరోసా, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ లో ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బహుముఖ పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా - కార్యదర్శి దండి సురేష్, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల సమగ్రాభివృద్ధి

**ప్రజా అభివృద్ధికి పంచాయతీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ ఎంతో కీలకం.**

**ప్రజల సమస్యల పరిష్కారానికి జెడ్పీ ప్రధాన వేదిక**

**గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయండి**

**సత్యసాయి జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెడదాం**

**జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్**



అనంత పురం సెప్టెంబర్ 25 నేటి శుభోదయ : కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ప్రజా అభివృద్ధిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జిల్లా పరిషత్ ప్రధాన వేదికగా నిలుస్తుందని తెలిపారు. కొత్తచెరువు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం కొత్తగా ఏర్పాటు చేసిన సత్యసాయి జిల్లా పరిషత్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో పాటు కూటమి ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు, నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, స్థానిక సమస్యలకు పరిష్కారం చూపడంలో జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ వ్యవస్థలు కీలకమన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం.జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, కలిసికట్టుగా పనిచేయాలని మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.సత్యసాయి జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెడదాం జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి అధికారులు అహర్నిశలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సత్యసాయి జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెట్టేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని [illegible] పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కూటమి ప్రజా ప్రతినిధులు, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఐలమ్మ ధైర్యసాహసాలు ఎప్పటికీ ఆదర్శమే

మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



ఖమ్మం, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: వీరనారి చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం ఆమెకు నివాళులర్పిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో ప్రజల హక్కుల కోసం సాగిన పోరాటంలో ఐలమ్మ పోషించిన పాత్ర మరువలేనిదని గుర్తుచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటిందని నామ వెల్లడించారు. అన్యాయాన్ని ఎదిరిస్తూ హక్కుల కోసం ఐలమ్మ చూపిన ధైర్యం, సంకల్పం ఎంతో గొప్పవని నామ స్పష్టం చేశారు. సామాజిక అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన ఆమె పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిందని వివరించారు. ముఖ్యంగా మహిళలు తమ హక్కుల కోసం ధైర్యంగా ముందుకు సాగేందుకు ఐలమ్మ జీవితం స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. ఆమె త్యాగాలను, పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని సూచించారు. న్యాయం,సమానత్వం కోసం నిలబడే ప్రతి ఒక్కరికీ ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు.

## ప్రజా గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

ప్రజల నుంచి 22 సమస్యలపై అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి



అనంత పురం సెప్టెంబర్ 25 నేటి శుభోదయ: ప్రజా గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు.పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన 22 అర్జీలను ప్రజల నుంచి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా, వాటిని సావధానంగా విని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రధానంగా రెవెన్యూ, తాగునీరు, రహదారులు, విద్యుత్, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలు ప్రజల నుంచి వచ్చినట్లు తెలిపారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి అర్జీని పరిశీలించి, సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలను అర్జీదారులకు తెలియజేయాలని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని బాధ్యతగా తీసుకుని సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సూచించారు.ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించేందుకు స్పందించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ అధికారులు , కూటమి ప్రజా ప్రతినిధులు,ప్రజలు పాల్గొన్నారు.

## పొంగి ప్రవహిస్తున్న శబరి, సీలేరు, సొకిలేరు నదులు

ఆంధ్ర ఒరిస్సా రాష్ట్రాల మధ్య స్తంభించిన రాకపోకలు

- జలదిగ్బంధంలో 10 గ్రామపంచాయతీలు



చింతూరు, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: గత మూడు రోజులుగా తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు శబరి, సీలేరు, సోకిలేరు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఛత్తీస్గడ్ రాష్ట్రంలో కురిసిన వానలకు శబరి నది పరుగులు పెడుతుంది. అలాగే ఒరిస్సాలో కురుస్తున్న వానలకు సీలేరు జలాశయం నుండి డొంకరాయికి, ఆచటి నుండి శబరి నదిలోకి మీరు విడుదల చేస్తున్నారు . చింతూరు నుండి ఒరిస్సా వెళ్లే (326) జాతీయ రహదారి చింతూరు-కుయిగురు గ్రామాల మధ్య నీటిలో మునిగిపోవడంతో ఆంధ్ర-ఒరిస్సా రాష్ట్రాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఒరిస్సా వెళ్లాల్సిన లారీలను చట్టి గ్రామంలోనే నిలుపుదల చేశారు. అలాగే చింతూరు నుండి విఆర్ పురం వెళ్లే మార్గంలో చింతూరు ఒడ్డు కు - చింతూరుకు వరద ప్రవాహం ఎక్కువ అవ్వడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు సంతపాకలు కు చందన గృహ యజమానులు తమ సామాన్లను వాహనాల్లో పెట్టి జాతీయ రహదారిపై భద్రపరచుకున్నారు , కోళ్ల షాపుల సముదాయం వైపు, లారీ ఆఫీస్ వెనుక వైపు కు శబరి నది ప్రవాహం చేరి ఇళ్లు మునిగి పోవడం తో ఖాళీ చేసి ప్రజలు రక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. చింతూరు-ముకునూరు మధ్య సోకిలేరు, జల్లి వారి గూడెం వాగు, అడవి వెంకన్నగూడెం వాగు, అన్నవరం వాగు పొంగి ప్రవహిస్తున్నాయి. వరద చుట్టుముట్టడంతో కల్లేరు, పెద్ద సీతనపల్లి, ముకునూరు, కుందులూరు, మట్టపల్లి, చింతరేవుపల్లి, అడవి వెంకన్నగూడెం, రామవరం, ఎ జి కోడేరు గ్రామపంచాయతీల లోని సుమారు 50 గ్రామాలు పైగానే జలదిగ్బంధంలో ఉన్నాయి. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ శుభమ్ నొక్వాల్ , తాసిల్దార్ అర్జున్ రావు లు అప్రమత్తమై ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లవలసిందిగా మైక్ లో అనౌన్స్మెంట్ చేశారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు. బాలింతలను ముందుగానే ఆసుపత్రులకు తరలించారు. వర్షం కారణంగా పాఠశాలకు సెలవు ప్రకటించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు లైన్లను పర్యవేక్షిస్తున్నారు.

## వరద బాధితులకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ భోజన సాయం



చింతూరు, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది.వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితుల కోసం ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసి అందించారు. వరదల కారణంగా సాధారణ జీవనం స్తంభించి, ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న బాధితులకు భోజనం అందించడం ద్వారా ట్రస్ట్ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ఆహారం, అవసరమైన సహాయాన్ని అందిస్తూ అండగా నిలవడమే తమ లక్ష్యమన్నారు.వరద పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు.. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో బాధితులకు భోజన సదుపాయం కల్పిస్తామని జమాల్ ఖాన్ తెలిపారు. వరదలు కొనసాగినన్ని రోజులు ఈ భోజన సేవలను నిరంతరాయంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.భోజన సాయం అందించిన జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్‌కు వరద బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



# పెరిగిపోతున్న జర్నలిస్టుల మరణాలు

- వృత్తిపరమైన ఒత్తిడులే కారణం
- జర్నలిస్టుల సమస్యలపై సమగ్ర అధ్యయనం చేయించాలి
- వారి సంక్షేమం దిశగా నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి
- రామగుండం, అంతర్గాం ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవంలో

**డబ్ల్యూజేఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్**




రామగుండం, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: రాష్ట్రంలో జర్నలిస్టులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారని, ఫలితంగా ఆకస్మిక మరణాలకు గురవుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దపెల్లి జిల్లా రామగుండం, అంతర్గాం ప్రెస్ క్లబ్ లను ఆయన యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ జర్నలిస్టుల స్థితిగతులను ప్రభుత్వం పరిశీలించి, వారి సంక్షేమానికి సంబంధించిన చర్యలు సత్వరం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాత్రికేయ వృత్తిలో పెరిగిన పోటీ తత్వం, యాజమాన్యాల ఒత్తిళ్లు జర్నలిస్టు వృత్తిని కత్తిమీద సాములా మార్చి వేశాయని అన్నారు. అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్న జర్నలిస్టులు యాజమాన్యాల నుండి వేతనాలు లేక, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందక వెట్టి చాకిరి వ్యవస్థలో

**మగ్గిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు.**

రాష్ట్రంలో పత్రికా రంగం, ఆ రంగంపై ఆధారపడి పనిచేస్తున్న జర్నలిస్టుల స్థితిగతులపై ప్రభుత్వం అధ్యయనం చేయించాలని వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామీణ పట్టణ, ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల్లో నూటికి 90 శాతం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే కావడంతో వారి సంక్షేమం కోసం ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా విధానాలు మారుతుండడంతో, జర్నలిస్టులకు సంబంధించి నివేషణ స్థలాల జీవోలు, జీవిత బీమాకు సంబంధించిన ఉత్తర్వులు ఊసుకు లేకుండా పోతున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం కేవలం అక్రిడికేషన్లు జారీ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు నిర్దిష్ట పద్ధతిలో సాగేందుకు వీలుగా చట్టం తీసుకురావాలని కోరారు. మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పిలవబడుతున్న రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా అనుబంధంగా రామగుండం, అంతర్గాం ప్రాంతాలలో డబ్ల్యూజేఐ అనుబంధంగా ప్రెస్ క్లబ్ ల ఏర్పాటుకు స్థానిక పాత్రికేయులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దీనికోసం విశేషంగా కృషి చేసిన పంజాల రాధాస్వామి గౌడ్ ను ఆయన అభినందించారు. త్వరలో గోదావరిఖని కేంద్రంలోనూ డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా నిరంతరం పనిచేస్తుందని హామీ ఇచ్చారు. సభ్యుల సంఖ్యను ప్రామాణికంగా చూపి, తమ సొంత ప్రయోజనాలను చక్కన పెట్టుకునే నాయకత్వాలకు భిన్నంగా డబ్ల్యూజేఐ పని చేస్తుందని తెలిపారు. తమ హక్కుల సాధన కోసం, రాష్ట్రంలోని జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు రావాల్సిన తరుణం ఏర్పడిందని అన్నారు. అంతర్గాం, రామగుండం ప్రెస్ క్లబ్ ల అధ్యక్షుడు పంజాల రాధాస్వామిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్గాం సర్పంచి ఆంబోతు రవికుమార్, గోలివాడ సర్పంచి కొలిపాక చంద్రారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి పూదరి సత్తయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగం కిరణ్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్, గౌడ సంఘం నాయకులు సింగం సత్తయ్య గౌడ్, బందారపు బుగ్గరాములు గౌడ్, కాంగ్రెస్ నాయకులు బొడ్డు లింగ మూర్తి, ఆవుల గోపాల్ యాదవ్, గౌస్ పాషా, గౌస్ బాబా, అప్పాసి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ సభ్యులు కాంపల్లి మల్లికార్జునస్వామి, దాసరి విష్ణు కుమార్, పల్లికొండ మధుకర్, తగురం కరుణాకర్, ఆరెపల్లి క్రాంతి కిరణ్, పూసాల రవి, కంది నాగరాజు, తూండ్ల శ్రీనివాస్ పటేల్, నగునూరి రాజయ్య గౌడ్, గౌడ సతీష్ కుమార్, కాసర్ల శంకర్, నంది సంతోష్ లు పాల్గొన్నారు.






## "మాజీ ఎంపిటిసి సభ్యుడు రెడ్డి సూరిబాబును ఘనంగా సన్మానించిన వైసిపి నాయకులు,కార్యకర్తలు, శ్రేయోభిలాషులు

పదవి కాలము పూర్తయినా సరే ప్రజలతోనే ఉంటా"



పెంటపాడు సెప్టెంబరు 25 (నేటి- శుభోదయ) మాజీ ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు సన్మాన సభ ఆయన స్వగృహం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు గ్రామ వైసిపి సెక్రటరీ చదలవాడ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సన్మాన గ్రహీత రెడ్డి సూరిబాబు మాట్లాడుతూ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన రెడ్డి యువజన సంఘం, వెలమ యువజన సంఘం నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు నాకు సపోర్టుగా నిలిచిన మండల ప్రజలకు పెంటపాడు గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ నేను ఎలక్షన్ లో నిలబడినప్పుడు నాకు సహకరించిన, కార్యకర్తలు అభిమానులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. నాకు పదవి ఉన్న, లేకపోయినా ఎప్పుడు ప్రజలతోనే ఉం ఉంటానని ప్రజలకు మరింత సేవ చేస్తానని పదవి లేదని కృంగిపోనని నేనెప్పుడూ ప్రజలతోనే ఉంటా, మీతోనే ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. నా దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికి నాకు తోచిన సహాయ సహకారాలు అందిస్తూ ఏ విషయాన్ని అయినా సరే నాకున్న పరిజ్ఞానంతో పరిష్కరించే వాడినని ఎవరి దగ్గర ఎటువంటి రూపాయి కూడా ఆశించకుండా నేను సేవ చేశానని, కాంట్రాక్టర్ల దగ్గర కూడా ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని కానీ నా మీద లేనిపోని చెప్పి నా మనసు బాధ కలిగించారని,నాయకులకు తప్పుడు సమాచారం చేరవేశారని దేవుని దయవలన నా కఇద్దరు కుమారులు మరియు కోడళ్ళు కూడా ఉద్యోగస్తులేనని నేను ఎవరి దగ్గర రూపాయి తీసుకునే అవసరం నాకు లేదని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చి నా అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ కంటి తడి పెట్టుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్యనైనా అవలీలగా పరిష్కరించే నాయకుడు రెడ్డి సూరిబాబు అని, పోలీస్ స్టేషన్లో కూడా పరిష్కారం కానీ సమస్యలను ఆయన పరిష్కరించే వారని ఆయన అన్నారు. మండల పరిషత్ అధ్యక్ష పదవి అవకాశం వచ్చిన సరే అవలీలగా తిరస్కరించారని పార్టీని విడనని పార్టీ నాకు కన్నతల్లి లాంటిదని, అలాంటి పార్టీకి ఎప్పుడు కూడా రుణపడి ఉంటానని పార్టీవిధేయుడుగా ఉంటూ సేవ చేస్తానని అటువంటి మంచి నాయకుడు సూరిబాబు అని కొనియాడారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ మాట్లాడుతూ రెడ్డి సూరిబాబు రాజకీయాలలో చాలా చురుకైన వ్యక్తిని అటువంటి వ్యక్తిని ఆదర్శంగా నేటి యువత తీసుకోవాలని రాబోయే రోజులలో మరిన్ని పదవులు ఆయనకు రావాలని ఆయన కోరారు. గ్రామ పార్టీ అధ్యక్షులు బర్ల జయరాంబాబు మాట్లాడుతూ సూరిబాబు మంచి రాజకీయవేతని అటువంటి మంచి నాయకుడిని నేను ఎప్పుడు చూడలేదని గత ఐదు సంవత్సరాలు ప్రజలకు ఎంతో సేవ చేశారని ఎంపీటీసీ సభ్యుడు గానే కాకుండా మండలంలో ఏ సమస్య ఉన్న అక్కడికి వెళ్లి పరిష్కరించి ప్రజలకు సేవ చేశారని ఆయన అన్నారు. రాబోయే రోజులలో ఆయనకు మంచి పదవ వరించి మండల పరిస్థితి అధ్యక్షుడు అవ్వాలని ఆయన ఆకాంక్షించారు. నల్లిమిల్లి విజయ నంద రెడ్డి మాట్లాడుతూ మా అందరిలో పెద్దాయనని పిలుచుకునే వ్యక్తి సూరిబాబు అని ఆయనకు కులమత భేదం లేకుండా అందరితో కలిసిపోయే వ్యక్తి సూరిబాబుకు రాబోయే రోజులలో మంచి పదవి వరించాలని ఆయన కోరారు. మాజీ వార్డ్ మెంబర్ మారంపూడి ఏసుదాస్ మాట్లాడుతూ సూరిబాబుకి నాకు 30 సంవత్సరాల నుండి అనుబంధం ఉందని ఎప్పుడు కూడా ఆయన ప్రజాసేవ కోసమే పరితపించే నాయకుడని, అటువంటి మంచి నాయకుడు పదవి ఉన్నా లేకపోయినా ప్రజా సేవకుడిగానే ఉండిపోతారని అటువంటి నాయకులలో సూరిబాబు ఒకరిని, గౌరవ మర్యాదలు తెలుసున్న వ్యక్తిని ఆయన కొనియాడారు. పార్టీలకతీతంగా తన దగ్గరకు వచ్చే ప్రతి ఒక్కరికి కూడా తన శక్తి కొలది సహాయ, సహకారాలు అందిస్తూ ప్రజలకు ఆయన ఎప్పుడూ కూడా సేవ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి పెంటపాడు మండల అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, ఏఎంసి మాజీ డైరెక్టర్ నల్లిమిల్లి గాంధీ రెడ్డి, ఏ ఏఎంసి మాజీ డైరెక్టర్ కర్రీ వరహాల రెడ్డి, నల్లిమిల్లి ప్రభాకర్ రెడ్డి, నల్లిమిల్లి అప్పిరెడ్డి, కొవ్వూరు విజయభాస్కర్ రెడ్డి, కర్రీ పృథ్వీ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచులు కునుకు పుల్లయ్య, గేదెల శివకుమార్, చల్లా కుమారస్వామి, మాజీ వార్డ్ మెంబర్ లక్ష్మి, ఉండ్రాజవరపు రాజు, మొఖమట్ల శ్రీనివాస్, తానేటి కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరు ప్రసాదరెడ్డి పెద్ద గజమాల కిరీటంతోసత్కరించారు. అనంతరం కార్యకర్తలు, నాయకులు అభిమానులు సాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు..

## ఎస్ బీ ఐ టీ లో ఘనంగా గణేష్ నిమర్జన వేడుకలు



ఖమ్మం, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: స్థానిక ఎస్. బీ. ఐ. టీ కళాశాలలో గణేష్ నిమర్జన వేడుకలు శుక్రవారం కళాశాల ప్రాంగణం లో ఘనంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. మొదట విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బంది సమక్షం లో గణేష్ శోభా యాత్ర ను నిర్వహించి తదనంతరం నిమర్జన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విఘ్నాలను తొలగింగే విఘ్నేశ్వరుడును భక్తి శ్రద్ధలతో సాగనంపడం మన ఆచారమని తెలిపారు.కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ ధాత్రి మాట్లాడుతూ తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాథుడు ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. గత సంవత్సరం ఖమ్మం పట్టణం ఇదే సమయంలో ఎదుర్కున్న వరద విపత్తులును గుర్తు చేసుకుంటూ ఆ గణేషుడి దీవెనలతో ఖమ్మం ప్రజలు ఈ సంవత్సరం అయినా సుఖ సంతోషాలతో ఉండాలని కళాశాల వైస్ చైర్మన్ కే.శ్రీ చైతన్య వేడుకున్నారు.శోభా యాత్ర లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు అధ్యాపకులు భక్తి ప్రపత్తులతో శుభ యాత్ర లో పాల్గొన్నారని, నిమర్జన కార్యక్రమాలలో అధిక సంఖ్యలో పాల్గొని ఆ గణనాథునికి వీడుకోలు పలికారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం కార్యక్రమంలో కళాశాలకు చెందిన ఈ.సి. ఈ విభాగం వారు 21,000 రూపాయలకు దక్కించుకున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్, డాక్టర్ ఏ. వి. వి.శివ ప్రసాద్, గంధం శ్రీనివాస్, వివిధ విభాగపు అధినేతలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యం

- పుట్టపర్తిలో భారీగా హాజరైన యువ క్రికెటర్లు
- అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోండి
- మచ్చా రామలింగారెడ్డి, చైర్మన్, క్రికెట్ అభివృద్ధి కమిటీ, ఆర్ డిటి



పుట్టపర్తి సత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లు ఎందరో ఉన్నారని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించి వారిని రాష్ట్రస్థాయి జాతీయస్థాయి క్రికెటర్లను తయారు చేయాలన్న లక్ష్యంతోనే ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపయోగించుకోవాలని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉద్భవిస్తున్న క్రికెట్ ప్రతిభను గుర్తించి, వారిని తీర్చిదిద్ది, వారికి అండగా నిలిచేందుకు 'రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్' (ఆర్ డిటి) చేపట్టిన 'రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్' కార్యక్రమం, అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవడం మరియు క్రమం తప్పకుండా క్రికెట్ సాధన చేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతోందని ఆర్ డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మచ్చ రామలింగ రెడ్డి తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి పట్టణంలోని రామ్ లక్ష్మణ్ క్రీడా మైదానం నందు ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ కార్యక్రమం జరిగిందిఈ ఎంపిక కార్యక్రమంలో ఏపిసి కృష్ణయ్య, సెలెక్టర్లు డి. ప్రదీప్, ఎస్.జె. షకీర్, ఎస్. ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆర్ డిటి కోఆర్డినేటర్ ప్రవీణ్, కోచ్ రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా, మొత్తం 140 మంది అభ్యర్థులు ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారని మచ్చ రామలింగ రెడ్డి తెలిపారు. అనంతపురంలో శిక్షణా శిబిరాలు, మ్యాచ్‌లను నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రతిభను గుర్తించి వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఆర్ డిటి కట్టుబడి ఉందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ముఖ్య అతిథి సూచించారు. పుట్టపర్తి ప్రాంతంలో సహజసిద్ధమైన క్రీడా ప్రతిభ పుష్కలంగా ఉందని, అథ్లెటిక్స్ ద్వారా చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని అలాగే అనంతపురంలో క్రీడల అభివృద్ధికి ఆర్ డిటి సమర్థవంతంగా కృషి చేస్తోందని ఆయన అన్నారు. క్రీడల పట్ల తనకు వ్యక్తిగత ఆసక్తి ఉందని మోంచో ఫెర్రర్ పేర్కొంటూ, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో జరుగుతున్న అద్భుతమైన కృషిని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ 'టాలెంట్ హంట్' ఎంతో ప్రయోజనకరమైన కార్యక్రమమని ఆయన అభిప్రాయపడ్డారు.

## అంగన్‌వాడీ కేంద్రం వద్ద అపరిశుభ్రత తాండవం

**మురుగునీటితో దుర్వాసన.. కలుషితమవుతున్న తాగునీటి పైపులైన్లు**



కారంపూడి: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 25 ; నేటి శుభోదయ: పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో ఉన్న అంగన్‌వాడీ పాఠశాల వద్ద అపరిశుభ్రత నెలకొనడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ముందే మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సమీపంలోని హరిజనవాడ ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మురుగునీరు ప్రవహిస్తున్న ప్రాంతంలోనే పంచాయతీకి సంబంధించిన తాగునీటి పైపులైన్లు పగిలిపోవడంతో మురుగునీరు పైపుల్లోకి చేరి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని వారు వాపోతున్నారు.మరోవైపు అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులు దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం మధ్య గడపాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున వెంటనే మురుగునీటి సమస్యను పరిష్కరించి, పరిసరాలను శుభ్రపరచాలని వారు కోరుతున్నారు.అధికారులు స్పందించి పాడైన తాగునీటి పైపులైన్లను మరమ్మతు చేయడంతో పాటు మురుగునీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.

## “ఆకస్మికంగా మృతి చెందిన టాక్సీ డ్రైవర్ ఏసు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి”



తాడేపల్లిగూడెం సెప్టెంబరు 25 (నేటి- శుభోదయ) ఇటీవల టాక్సీ స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఊరేగింపు కార్యక్రమంలో టాక్సీ డ్రైవర్ ఏసు ఆకస్మికంగా మృతి చెందడం పట్ల తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏసు కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి ఏసు కుటుంబానికి బొలిశెట్టి శ్రీనివాస్ మరియు పైబోయిన వెంకట్రామయ్య కలిసి రూ.1,00,000/- ఆర్థిక సహాయం అందించారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి, వారికి భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌డీఏ నాయకులు, స్థానిక నాయకులు, టాక్సీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## హోమ్ గార్డ్ వ్యవస్థ వెనుక ఇదీ అసలు కథ

ఖమ్మం, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: హోమ్ గార్డు వ్యవస్థ అనేది 6, డిసెంబర్, 1946లో బొంబాయిలో పౌర కల్లోలాలు, మతపరమైన అల్లర్లను నియంత్రించడంలో పోలీసులకు సహాయం చేయడానికి హోమ్ గార్డులను తీసుకున్నారు. తదనంతరం, శాంతిభద్రతల పరిరక్షణకు, వరదల, అగ్నిప్రమాదల నివారణ, కరువులు, అత్యవసరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు పోలీసులకు సహాయకుడిగా స్వచ్ఛంద పౌరుల దళం అని పరంతి రక్షాధక్ష అని పశ్చిమ బెంగాల్, విలేజ్ గార్డ్స్, సివిక్ గార్డ్స్ కొన్ని రాష్ట్రాలు ఆమోదించాయి.1962లో చైనా దురాక్రమణ నేపథ్యంలో కేంద్రము, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ ప్రస్తుత స్వచ్ఛంద సంస్థలను ఏకం చేయాలని సూచించింది. అప్పుడు హోమ్ గార్డ్స్ గా పిలువబడే ఆల్ ఇండియా ఫోర్స్ గా ఏర్పడింది. ఈ హోమ్ గార్డ్స్ సర్వీస్ పెరిగి, హోమ్ గార్డులు కూడా పోలీసులకు ఏమాత్రం తేడా లేకుండా పోలీసులతో సమానంగా 24 గంటలు అన్ని విధులు నిర్వహిస్తున్నారు అలాగే అన్ని బందోబస్తులు, ట్రాఫిక్ లో, నైట్ బీట్ లు, అన్ని పోలీస్ విభాగాలలో పోలీస్ లతో సమాన విధి నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఎంతో మంది హోమ్ గార్డులు కూడా బలిఅయ్యారు. నేడు హోమ్ గార్డ్స్ వ్యవస్థ పెరిగి నేడు దేశవ్యాప్తంగా 5లక్షల చేరుకుంది. నేడు 5లక్షల హోమ్ గార్డులు కనీస సౌకర్యాలు లేక హోమ్ గార్డుల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరముగా ఉంది. భారతదేశంలో హోమ్ గార్డు వ్యవస్థ ఉన్నది. ఆ రాష్ట్రంలో ఈలా చేశారు, ఈ రాష్ట్రంలో ఇలా చేశారు, అని చెప్పుకోవడమే తప్ప, ఏ రాష్ట్రంలో కూడా హోమ్ గార్డులకు పూర్తిస్థాయిలో చేసింది లేదు. ప్రధానమంత్రి కి, కేంద్ర హోంశాఖ మంత్రి కి నమస్కరిస్తూ, ఈ హోమ్ గార్డ్స్ వాలంటరీ అను చట్టాన్ని రద్దు చేయాలని హోమ్ గార్డ్స్ కు ఉద్యోగ హోదా కల్పించాలని, హోమ్ గార్డ్స్ కు గ్రూప్-సి, గ్రూప్-డి ఉద్యోగాలు ఇవ్వాలని ప్రార్థిస్తున్నాము. యావత్ భారతదేశంలో ఉన్న 5లక్షల పైన ఉన్న హోంగార్డుల కుటుంబాలు బాగుపడుతాయి.

# స్థానిక సంస్థల ఎన్నికలలో వైఎస్ఆర్సిపి జెండా ఎగరవేస్తాం

**అన్ని వర్గాల సంక్షేమం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం**

**- మాజీ మంత్రి, డా సాకే శైలజనాథ్, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ**




నార్పల,(శింగనమల), సెప్టెంబర్, 25,: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయ కేతనం ఎగరవేస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకటించారు. సుశిక్షితులైన కార్యకర్తలు తమ పార్టీకి ఉన్నారని, వారి నేతృత్వంలోనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా స్థానిక సంస్థల ఎన్నికలలో రేపరెపలాడటం ఖాయమని మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో శుక్రవారం నూతన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్లమెంటు పరిశీలకులు బి. నరేష్ కుమార్ రెడ్డి, నియోజకవర్గం పరిశీలకులు ఎల్ఎం మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఖాదర్ వలి , నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డా సాకే శైలజనాథ్ మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పదవుల కోసం జరిగే ఎన్నికలు కావు... గ్రామాల భవిష్యత్తును నిర్దేశించే ఎన్నికలు...ఎవరి చేతుల్లో అధికారం ఉండాలన్న విషయాన్ని ప్రజలు నిర్ణయించే ఎన్నికలు... మనమంతా ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి... రాజకీయ పార్టీఅంటే ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజల దగ్గరకు వెళ్లేది కాదు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ముందుండి పోరాడేదే నిజమైన రాజకీయ పార్టీ.వైఎస్ జగన్ మోహన్ రెడ్డిప్రభుత్వాన్ని ప్రజలు ఇప్పటికీ ఎందుకు గుర్తు చేసుకుంటున్నారో ఆలోచన చెయ్యండి అని అన్నారు.. ఎందుకంటే ఆ ప్రభుత్వంలో సంక్షేమం ఇంటి గడపకు వెళ్లింది. అమ్మఒడి,ఆసర, చేయూత, సున్నా వడ్డీ, జగనన్నతోడు, బీమా, పెన్షన్, ఫీజు రీయింబర్స్మెంట్, రైతు భరోసా వంటి పథకాల ద్వారా అన్నివర్గాలకు నేరుగా ప్రయోజనం అందాయి. ఇది ఎవరు కాదనలేని సత్యం.. అదే సందర్భంలోమన ప్రాంతంలో రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య రంగం, సాగునీటి అంశాలపై జగనన్న ప్రభుత్వం పెట్టిన దృష్టిన అంశాన్ని కార్యకర్తలు ప్రజలకు ప్రజలకు వివరించాలి...“గత ఐదేళ్లలో మీ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరింది. ఈ కూటమి ప్రభుత్వంలో మీ కుటుంబానికి ఎలాంటి లబ్ధి చేకూరుతుంది అనే విషయాన్న గమనించాలని కోరుతున్నాం..గతంలో ప్రభుత్వ పథకం కోసం మీరు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగారా లేక పథకం మీ ఇంటి గడపకు వచ్చిందా అనే విషయం ఒక్కసారి ఆలోచన చేస్తే ఏ ప్రభుత్వానికి ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు సంగతి ఏమిటి? వాటిలో ఎన్ని అమలు చేశారు, అందులో ప్రజలకు ఎంత మాత్రం లబ్ధి చేకూరింది అనే విషయాన్ని ప్రజలనే అడిగితే తెలుస్తుంది అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మనం గెలవబోతా ఉన్నాం... తిరుగులేని విజయాన్ని నమోదు చేసుకోబోతున్నాం.. గత ప్రభుత్వంలో జగనన్న చేసిన మంచే మన అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపిస్తుంది. ఈ రెండున్నర సంవత్సరాలకు కూటమి పాలనతో ప్రజలు ఎంత విసిగిపోయారో అనే విషయాలు త్వరలోనే తెలుస్తాయి.. మనకు వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాలు అవసరం లేదు.ప్రజల కోసం పోరాడే రాజకీయాలు కావాలి. రైతుకు నీరు కావాలి. యువతకు ఉద్యోగం కావాలి. విద్యార్థికి నాణ్యమైన విద్య కావాలి. మహిళకు ఆర్థిక భరోసా కావాలి. వృద్ధుడికి గౌరవప్రదమైన పెన్షన్ కావాలి. గ్రామానికి రోడ్డు, డ్రైనేజీ, తాగునీరు కావాలి.మన పార్టీ కార్యకర్తలు ఐక్యంగా, క్రమశిక్షణతో, ప్రజల మధ్య పనిచేస్తే మనకు ప్రజల మద్దతు మరింత బలపడుతుంది అని అన్నాపార్టీకి కార్యకర్త వెన్నె ముక

పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి

సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మీ అందరికీ ఒకే మాట చెప్తున్నాను.. పార్టీకి కార్యకర్తే వెన్నెముక అనే అంశాన్ని ఘంటాపథంగా చెబుతున్నామని ప్రకటించారు. .ఈ కూటమి ప్రభుత్వంలో అనేక సమస్యలు గ్రామంలో సమస్యలు.. రైతుకు సమస్యలు.. మహిళలకు సమస్యలు.. యువతకు సమస్యలు.. తాగునీటి పరిస్థితిలు.. ఇలా ఎన్నో రకాలు సమస్యలు రాజ్యమేలుతోంది...కానీ ఈ ప్రభుత్వం ప్రజా పాలన పక్కకు పెట్టి ప్రజా వ్యతిరేక పాలనా చేస్తున్నారు...గత ప్రభుత్వ కాలంలో జరిగిన పనులను అదే సమయంలో ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న పనులు, అమలు చేస్తున్న పథకాలు, వాటి ప్రయోజనాలు కూడా ప్రజలకు వాస్తవాలను ప్రజలకు వివరించాలి అని అన్నారు. ప్రజల పక్షాన నిలబడే పార్టీగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి అని అన్నారు.. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికలు అంటే నాకు ఒక విషయం గుర్తుకు వస్తుంది. రాజకీయ నాయకుడు ఎన్నికల సమయంలో ప్రజల దగ్గరకు వెళ్లడం కాదు... ప్రజల సమస్య వచ్చిన ప్రతిసారీ వారి దగ్గరకు వెళ్లాలి. అదే నిజమైన ప్రజా ప్రతినిధిత్వం.గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నేరుగా ప్రజలకు చేరేలా అనేక పథకాలు అమలు చేశారు. రైతు భరోసా నుంచి విద్యార్థుల వరకు, ఆరోగ్యశ్రీ నుంచి ఇళ్ల వరకు అనేక రంగాల్లో ప్రభుత్వ జోక్యం కనిపించింది. కానీ ఈ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమాత్రం అమలు చేశారో ప్రజలుకు పూర్తి గా అర్థమయింది అని అన్నారు. పార్లమెంటు అబ్జర్వర్ బి.నరేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమం, రైతులకు భరోసా, విద్యార్థులకు ప్రోత్సాహం, మహిళలకు అండ, గ్రామాలకు అభివృద్ధి అనే దిశగా పాలన సాగింది. కానీ ఈ ఫోటోని ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, రెడ్బుక్కు రాజ్యాంగం అమలతో వ్యక్తులను భయభ్రాంతులకు గురి చేస్తూ వ్యవస్థలను నాశనం చేస్తున్నారు. మాటలు చెప్పడం సులభం... కానీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే అసలు పాలన.జగన్‌గారి ప్రభుత్వంలో పథకాలు నేరుగా ప్రజల ఖాతాల్లోకి వెళ్లే విధంగా వ్యవస్థను నిర్మించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ ఎల్ ఎం మోహన్ రెడ్డి మాట్లాడుతూ...ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల దగ్గరకు వెళ్లడం రాజకీయాలు కాదు. ప్రజలకు సమస్య వచ్చి నప్పుడు ముందుగా గుర్తుకు వచ్చేది మన కార్యకర్త కావాలి. ప్రజల కష్టం కనిపిస్తే ముందుగా స్పందించేది మన పార్టీ కావాలి. కార్యకర్తలందరికీ నేను ఒకటే చెబుతున్నాను వ్యక్తి గత విభేదాలకు చోటు లేదు. అందరం ఒకే కుటుంబం ఒకే జెండా... ఒకే లక్ష్యం. వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ నార్పల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికలు అంటే కేవలం పదవుల కోసం జరిగే ఎన్నికలు కాదు. గ్రామంలో ఎవరు ప్రజల మధ్య ఉన్నారు ఎవరు ప్రజల సమస్యలపై నిలబడతారు ఎవరు కష్టకాలంలో ప్రజలకు అండగా ఉంటారు? అనే విషయాలను ప్రజలు నిర్ణయించే ఎన్నికలు..అందుకే ప్రతి కార్యకర్త ఈ ఎన్నికలను చాలా బాధ్యతగా తీసుకోవాలి అలాగే జగనన్న మాటను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని అన్నారు .మన బలం నాయకుల్లో మాత్రమే లేదు...మన బలం ప్రతి గ్రామంలో ఉన్న కార్యకర్తలో ఉంది..మన బలం ప్రతి ఇంటితో ఉన్న సంబంధంలో ఉంది.మన బలం ప్రజల సమస్యలపై మనం చేస్తున్న పోరాటంలో ఉంది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఖాదర్ వలీ ఖాన్, నాయకులు సరిబాల ప్రతాపరెడ్డి, నాగరత్నమ్మ, బోగతి ప్రతాప్ రెడ్డి, నాగేశ్వర రావు, చామలూరు రాజగోపాల్, యువ నాయకులు డాక్టర్ సాకే రుత్విక్ హృదయ్ మరియు కేతిరెడ్డి సాయి ప్రతాప్ రెడ్డి, పుట్లూరు గార్లదిన్నె మండలం పార్టీ అధ్యాకులు మహేశ్వర్ రెడ్డి, ఎల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి, జయరామి రెడ్డి, కల్లూరు సూర్యనారాయణ, పసుపులేటి పద్మావతి, అమ్మవారిపేట పార్వతి, బోనాల హరికృష్ణ, మంజునాథ్, శ్యాంసుందర్ రెడ్డి, మంత్రి ఆంజనేయులు, అనిల్ కుమార్ రెడ్డి, పట్నం పనింద్ర, ఆనంద్, నాగలింగా రెడ్డి, బయపు రెడ్డి, పాటిల్ దివాకర్ రెడ్డి,సాకే రామాంజనేయులు,సాయి, సోహైల్, మహేష్,హరి,రాజారెడ్డి,జగదీష్ రెడ్డి, అంజనమూర్తి, వెంకటరామిరెడ్డి , మొరుసు రమణ రెడ్డి, భాస్కరరెడ్డి,శంకర్ యాదవ్ , నారాయణరెడ్డి, రాంభూపాల్, శివారెడ్డి,రంగారెడ్డి, కాటంరెడ్డి, ఎంఎస్ నాయుడు, రమణ,కృష్ణారెడ్డి, రామయ్య, లక్ష్మయ్య,రామాంజి, రవి ప్రతాప్ రెడ్డి,పెద్దిరెడ్డి, లక్ష్మీరెడ్డి, లక్ష్మీనారాయణ, రవీంద్ర రెడ్డి, వెంకట్రామిరెడ్డి,మల్లికార్జున , నాగరాజు, రాము, ప్రవీణ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు..

# చెరుకూరు వెంకటేశ్వరరావు కుటుంబం ధన్యజీవులు నెల నెలా వెన్నెల కార్యక్రమం జిల్లాకు తలమానికం

**నూతి సత్యనారాయణ గౌడ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు**



ఖమ్మం, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: కీర్తిశేషులు చెరుకూరు వెంకటేశ్వరరావు వారి కాలం నుండి వారి పిల్లలు నేటి కాలం వరకు సమాజ సేవలో ఉంటూ వారి కుటుంబం ధన్యజీవులుగా మిగిలారని వారిది మాది ఒకే గ్రామం కావడం వారు చేస్తున్న సేవలు నా చిన్నతనం నుండి నేటి వరకు చూడగలుగుతున్నాని ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని అభినందించారు. 110 నెలలుగా ప్రతినెల వ్యయ ప్రయాసలకోర్చి నిర్వహిస్తూ జిల్లాకు తలమానికమైన కార్యక్రమంగా నిలిపారని వారు మా ముందు ఉంచిన భక్త రామదాసు కళాక్షేత్రానికి సంబంధించిన సౌకర్యాలకు సంబంధించి నేను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తానని సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రముఖ న్యాయవాది కాటంనేని రమేష్ రిటైర్డ్ టీచర్ ఆలుష్యం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 110 నెలల వెన్నెల కార్యక్రమం నిర్వహిస్తున్న మూడు సంస్థల వారు నిండు ఆయురారోగ్యాలతో ఉండి 1000 పది కార్యక్రమాల వరకు నిర్వహించాలని అలా ముందుకు సాగాలని అభిలాషించారు ఈరోజు కార్యక్రమానికి స్పాన్సర్ దివంగత ఉపాధ్యాయులు చెరుకూరి వెంకటేశ్వరరావు జానకమ్మ ల స్మరణలో జరుగుతున్నది. వారు జీవితం అంతా కూడా విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దడానికి నిస్వార్థంగా సేవలందించినటువంటి వారిని వారి శిష్యులుగా ఉన్నవారు అనేకమంది ప్రయోజకులుగా ఇవాళ సమాజంలో పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంటున్నారని వారి అడుగుజాడల్లోనే వారి పిల్లలు కూడా కుటుంబాలు కూడా నిలవడం ఆదర్శప్రాయము అని వారిని స్మరించుకునే అవకాశం రావడం ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజ సేవకు కోరుకుంటున్నా వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి వెంకటేశ్వరరావు కుమార్తెలు అల్లుళ్లు వారి పిల్లలు ముందుగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించగా ఈ కార్యక్రమంలో చెరుకూరి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్, మోటమర్రి జగన్మోహన్రావు, కే దేవేంద్ర, డాక్టర్ నాగబత్తిని రవి, మారిస్గంటి తిరుమలాచార్యులు, నామల లక్ష్మీనారాయణ, వేముల సదానంద్, యాంకర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# పాలేరు నియోజకవర్గ రాజకీయాల్లో కందాళ కొత్త వ్యూహం

**స్థానిక ఎన్నికలే లక్ష్యంగా సీనియర్ నేతలపై దృష్టి**

**- బలమైన నాయకత్వం కోసం కసరత్తు కందాళ నేతృత్వంలో జిల్లాలో పార్టీ విస్తరణకు వ్యూహ రచన?**

ఖమ్మం, సెప్టెంబర్ 25, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా రాజకీయాల్లో మరోసారి కొత్త సమీకరణాలకు తెరలేస్తోందా.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిఆర్ఎస్ పార్టీ జిల్లాలో తన రాజకీయ పునాదులను మరింత బలోపేతం చేసుకునేందుకు కసరత్తు ప్రారంభించిందా.. ప్రస్తుతం జిల్లాలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ఈ ప్రశ్నలకు బలం చేకూరుస్తున్నాయి. మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పార్టీ బలాన్ని పెంచుకోవడంపై బిఆర్ఎస్ అధిష్ఠానం దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా రాజకీయ అనుభవం, వ్యక్తిగత అనుచరగణం, నియోజకవర్గ స్థాయిలో ప్రభావం ఉన్న సీనియర్ నాయకులను పార్టీలోకి తీసుకురావడం ద్వారా క్షేత్రస్థాయిలో సంస్థాగత బలాన్ని పెంచుకోవాలనే ఆలోచనలో పార్టీ ఉన్నట్లు సమాచారం.

### - పలువురు నేతలకు కీలక బాధ్యతలు

మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఆయన పాత్రపై ఆసక్తి నెలకొంది. 2024 లో జరిగిన ఎన్నికలలో ఓడిన తర్వాత నిరంతరం కృషి చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ ను సంస్థాగతంగా బలోపేతం చేయడంలో పువ్వాడ అనుభవాన్ని వినియోగించుకోవాలనే ఆలోచన పార్టీ అధిష్ఠానంలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గాల వారీగా నాయకత్వాన్ని బలోపేతం చేయడం, సీనియర్ నాయకులతో సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమీకరించడం వంటి అంశాల్లో ఆయనకు కీలక పాత్ర ఉండొచ్చన్న చర్చ సాగుతోంది. అయితే పువ్వాడ కి జిల్లాలోని ఏ నియోజకవర్గానికి, ఏ స్థాయిలో బాధ్యతలు అప్పగించారన్న దానిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

### - పాత నేతలు, కొత్త రాజకీయ సమీకరణాలు

ఖమ్మం జిల్లాలో గతంలో రాజకీయంగా ప్రభావం చూపిన పలువురు సీనియర్ నాయకులపై బిఆర్ఎస్ దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఖమ్మం, వైరా, పాలేరు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం.

### - పాలేరు లో సమీకరణాలపై ఆసక్తి

ఖమ్మం రాజకీయాల్లో మాజీ మంత్రి పువ్వాడ కు సుదీర్ఘ అనుభవం ఉంది. 2014లో ఖమ్మం నుంచి ఓడిన తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన, అప ఇదే నియోజకవర్గంలో మద్దిశెట్టి వేణుగోపాల్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితర నాయకుల చుట్టూ గత ఎన్నికల సమయంలో రాజకీయ సమీకరణాలు మారాయి. ఈ నేపథ్యంలో దర్శి నియోజకవర్గంలో బలమైన రాజకీయ నిర్మాణాన్ని ఏర్పాటు చేసేందుకు జనసేన ఎలాంటి వ్యూహాన్ని అనుసరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

### కందుకూరుపై ప్రత్యేక దృష్టి

కందుకూరు నియోజకవర్గంలో మానుగుంట కుటుంబానికి దశాబ్దాలుగా రాజకీయ ప్రాధాన్యం ఉంది. మానుగుంట మహీధర్‌రెడ్డి 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2024 ఎన్నికల్లో ఆయనకు ఆ పార్టీ నుంచి టికెట్ దక్కలేదు. ప్రస్తుతం కందుకూరులో జనసేనకు స్థానికంగా మరింత బలమైన సంస్థాగత నిర్మాణం అవసరమనే చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో అనుభవజ్ఞులైన నాయకత్వాన్ని పార్టీలోకి తీసుకురావడం ద్వారా పార్టీకి కొత్త ఊపునివ్వాలనే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మానుగుంట మహీధర్‌రెడ్డి జనసేనలో చేరనున్నారనే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ఈ అంశం ప్రస్తుతం రాజకీయ చర్చలకే పరిమితమైంది.

### కనిగిరిలోనూ సీనియర్ నేతలపై దృష్టి

కనిగిరి నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు కదిరి బాబూరావుకు గతంలో రాజకీయ అనుభవం ఉంది. 2014లో టీడీపీ తరఫున కనిగిరి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన, 2019లో దర్శి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరిన ఆయన 2024 నాటికి ఆ పార్టీకి దూరమయ్యారు.ఇలాంటి రాజకీయ అనుభవం ఉన్న నాయకులను సమీకరించడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తన సంస్థాగత ఉనికిని మరింత బలోపేతం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

### 2029 లక్ష్యంగా ఇప్పటి నుంచే కసరత్తు

స్థానిక సంస్థల ఎన్నికలను కేవలం తక్షణ రాజకీయ పోరాటంగా కాకుండా, భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేసుకునే వేదికగా జనసేన చూస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.నియోజకవర్గాల వారీగా బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడం, గ్రామస్థాయిలో కార్యకర్తలను సమీకరించడం, స్థానిక సంస్థల్లో పార్టీ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవడం ద్వారా 2029 నాటికి జిల్లాలో పార్టీ రాజకీయ స్థావరాన్ని మరింత విస్తరించాలనే వ్యూహంపై కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.ఇందులో భాగంగా గ్రామం నుంచి మండలం, నియోజకవర్గం వరకు పార్టీ వ్యవస్థను పటిష్ఠం చేయడం, స్థానికంగా ప్రభావం ఉన్న నాయకులను సమన్వయం చేయడం, ఎన్నికల సమయంలో సమర్థవంతమైన కేడర్‌ను అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

### బాలినేని అనుభవం.. ప్రణీత్‌రెడ్డి వ్యూహాలు

ప్రకాశం జిల్లా రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబానికి ఉన్న రాజకీయ పరిచయాలు, స్థానిక పరిస్థితులపై అవగాహన జనసేనకు ఉపయోగపడే అంశాలుగా పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.అదే సమయంలో బాలినేని కుటుంబానికి చెందిన ప్రణీత్‌రెడ్డి కూడా రాజకీయ వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నట్లు జిల్లాలో చర్చ జరుగుతోంది. దీంతో బాలినేని అనుభవం, కుటుంబానికి ఉన్న స్థానిక రాజకీయ పరిచయాలు, పార్టీకి ఉన్న కేడర్‌ను సమన్వయం చేయడం ద్వారా ప్రకాశం జిల్లాలో జనసేనకు కొత్త రాజకీయ నిర్మాణాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా అన్న చర్చకు తెరలేచింది.అయితే పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ఎవరికి ఏ బాధ్యతలు అప్పగించారు.. ఏ నియోజకవర్గానికి ఎవరిని సమన్వయకర్తగా నియమించారు. భవిష్యత్‌లో ఎవరెవరు జనసేనలో చేరనున్నారు..? అనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

### స్థానిక ఎన్నికలే అసలు పరీక్ష

ప్రకాశం జిల్లాలో జనసేన బలాన్ని అంచనా వేయడానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కీలకంగా మారే అవకాశం ఉంది. గ్రామస్థాయిలో పార్టీకి ఉన్న వాస్తవ బలం, కొత్తగా చేరే నాయకుల ప్రభావం, టీడీపీతో ఉన్న రాజకీయ సమన్వయం, నియోజకవర్గాల వారీగా నాయకత్వ సామర్థ్యం వంటి అంశాలు ఎన్నికల సమయంలో కీలకంగా మారనున్నాయి.సీనియర్ నాయకుల చేరికలు జరిగితే అవి ఆయా నియోజకవర్గాల్లో పార్టీ రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

### మారుతున్న సమీకరణాలపై ఉత్కంఠ

మొత్తంగా చూస్తే.. ప్రకాశం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణాలపై చర్చ మళ్లీ వేగం పుంజుకుంది. సీనియర్ నాయకులను పార్టీలోకి తీసుకురావాలనే ప్రయత్నాలు, నియోజకవర్గాల వారీగా కొత్త బాధ్యతలు, క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణ, గ్రామస్థాయిలో కేడర్ నిర్మాణం వంటి అంశాలు రాబోయే రోజుల్లో జనసేన రాజకీయ ప్రయాణంలో కీలకంగా మారే అవకాశం ఉంది.అయితే ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉంది. ఆ ప్రకటనల తర్వాతే ప్రకాశం జిల్లాలో జనసేన అనుసరించబోయే వ్యూహంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .